ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 27, పేజీలు - 08

బుధవారం, జులై 22, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# డీలిమిటేషన్ పార్లమెంట్‌కేనా.. అసెంబ్లీలకూ పెరుగుతాయా?

## - తెలుగు రాష్ట్రాల్లో సీట్ల పెంపు గ్యారంటీ ఎంత?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించే డీలిమిటేషన్ చట్టం అమల్లోకి వస్తే కేవలం లోక్‌సభ స్థానాలే పెరుగుతాయా లేక రాష్ట్రాల శాసనసభ సీట్లు కూడా పెరుగుతాయా? అనేది ఇప్పుడు తెలుగు రాష్ట్రాల పొలిటికల్ సర్కిళ్లలో అత్యంత ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. డీలిమిటేషన్ అనగానే చాలామంది కేవలం ఎంపీ సీట్ల పెంపు గురించే చర్చిస్తున్నప్పటికీ, రాజ్యాంగ నిబంధనలు , ప్రతిపాదిత 131వ రాజ్యాంగ సవరణల ప్రక్రియ ప్రకారం పార్లమెంట్ సీట్లతో పాటు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలు కూడా ఖచ్చితంగా పెరుగుతాయి. రాజ్యాంగంలో లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ప్రత్యేకమైన అధికరణలు ఉండటమే దీనికి ప్రధాన కారణం.

### - రెండింటికీ వేర్వేరుగా లేదా ఒకే రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా సవరణలు

భారత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ స్థానాల విభజన ఆర్టికల్ 81, 82ల ప్రకారం జరిగితే రాష్ట్ర శాసనసభ స్థానాల పునర్విభజన ఆర్టికల్ 170 పరిధిలోకి వస్తుంది. డీలిమిటేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు, రాజ్యాంగంలోని ఈ రెండింటికీ వేర్వేరుగా లేదా ఒకే రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా సవరణలు చేయాల్సి ఉంటుంది. ఆర్టికల్ 170 పై ఉన్న నిషేధాన్ని తొలగించకుండా కేవలం ఎంపీ సీట్లను పెంచడం సాధ్యపడదు. కాబట్టి డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమైతే లోక్‌సభతో పాటు ప్రతీ రాష్ట్ర శాసనసభ స్థానాల సంఖ్యను కూడా దామాషా పద్ధతిలో పెంచడానికి చట్టపరమైన ప్రాతిపదిక సిద్ధమవుతుంది.

### - విభజన చట్టం ప్రకారం సీట్లు పెంచాల్సిందే!

ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు సంబంధించి ఒక ప్రత్యేకమైన చట్టపరమైన కోణం కూడా ఉంది. 2014లో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లోని సెక్షన్ 26 ప్రకారం విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ సీట్లను 225కి, తెలంగాణలో ఉన్న 119 సీట్లను 153కి పెంచాలని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం 2026 తర్వాత జరిగే తొలి జనాభా లెక్కల వరకూ సీట్ల పెంపుపై ఫ్రీజ్ ఉన్నందున, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని ఆ నిబంధన అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లు ద్వారా ఆర్టికల్ 170 సవరణ జరిగి నియోజకవర్గాల సరిహద్దుల ఫ్రీజ్ తొలగిపోతే

2లో..

# ప్రధాని నివాసం ముట్టడికి రాహుల్, ప్రియాంక యత్నం

## - ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత, కాంగ్రెస్ నేతల అరెస్ట్!

- నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
- అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది. నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్,

2లో..

# ప్రతి నెలా తనిఖీ చేస్తా

## - కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

## - నెలలో ఒకరోజు సైట్లోనే బస చేస్తానన్న సీఎం - పనుల్లో వేగం పెంచాలని అధికారులకు ఆదేశం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హకీంపేటలోని ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణ పనుల్లో జాప్యాన్ని ఎట్టి పరిస్థితిలో సహించబోనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సొంత నియోజకవర్గం కొడంగల్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి, దుద్యాల మండలం హకీంపేటలో అభివృద్ధి పనులను పరిశీలించారు. 248 ఎకరాల్లో చేపడుతున్న మెడికల్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఇంజినీరింగ్ కళాశాల, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన రేవంత్ రెడ్డి ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రతి ప్రాజెక్టు పనుల పురోగతిపై నెలవారీగా నివేదిక ఇవ్వాలని అధికారులను

2లో..

# రాజకీయ నాటకాలు వద్దు

## - కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ తీరుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటు సమావేశాల వేళ సభలో చర్చల్లో పాల్గొనకుండా, ప్రధానమంత్రి నివాసం వెలుపల నిరసనల పేరుతో

2లో..

# దావోస్‌లో కుదిరిన ఒప్పందానికి కార్యరూపం

## - ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ ఒప్పందం

- సీఎం చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ భేటీ
- మామిడి, అరటి వంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పనే లక్ష్యం
- ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య కుదిరిన కీలక భాగస్వామ్యం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుదుర్చుకున్న మరో కీలక అంతర్జాతీయ ఒప్పందం దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో భారీ 'ఫుడ్ క్లస్టర్' ఏర్పాటుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ముందుకు వచ్చింది. ఈ మేరకు బుధవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం ప్రత్యేకంగా భేటీ అయింది. దావోస్ పర్యటన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సుముఖత వ్యక్తం చేసింది. ఇందులో భాగంగానే మంగళవారం సీఎంతో జరిగిన చర్చల్లో రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో సమగ్రమైన 'వాల్యూ చైన్' నిర్మించాలని యూఏఈ నిర్ణయించింది. ఈ భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మామిడి, అరటి, కోకో వంటి విలువైన ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి నేరుగా అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసేలా మౌలిక వసతులు కల్పించనున్నారు. ఈ చారిత్రాత్మక భాగస్వామ్యం వల్ల రాష్ట్రంలోని

2లో..

# తెలంగాణలో ప్రత్యామ్నాయ పంటల విధానాన్ని ప్రోత్సహిస్తున్నాం

## - డిప్యూటీ సీఎం భట్టి కీలక కామెంట్స్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎల్‌నినో సవాళ్లపై తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళిక రచిస్తోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్టుగా చెప్పారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైనా రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు నిపుణుల సూచనల మేరకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో

2లో..

# మంగళగిరిలో నారా లోకేశ్ 'పట్టా'భిషేకం

- 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమానికి శ్రీకారం
- సుమారు 7.30 గంటల పాటు నిలబడే పట్టాలు అందించిన మంత్రి లోకేశ్
- లబ్ధిదారులకు పట్టాతో పాటు నూతన వస్త్రాలు బహూకరణ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ ప్రభుత్వం రూ.1000 కోట్ల విలువైన ఆస్తులను పేదలకు పంపిణీ చేసింది. ఏపీ మంత్రి నారా లోకేష్ తన నియోజకవర్గంలో దాదాపు 3 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి వారి జీవితంలో సంతోషాన్ని నింపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని నారా లోకేష్ స్పష్టం చేశారు. సొంత నియోజకవర్గం మంగళగిరిలో 'మన ఇల్లు- మన లోకేష్' కార్యక్రమం ద్వారా 3000 మంది పేద కుటుంబాలకు స్వయంగా ఇళ్ల పట్టాలను మంగళవారం ఉదయం పంపిణీ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దాదాపు రూ.1000 కోట్ల విలువైన ఆస్తులను భూమి పట్టాల రూపంలో నిరుపేదలకు అందించామని

2లో..

# హైకోర్టును ఆశ్రయించిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

## - నేడు పిటిషన్ పై విచారణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో, తీవ్ర వివాదంలో చిక్కుకున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆయన క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టనుంది. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్

2లో..

# కాంగ్రెస్ తెచ్చిన కరువుతో రైతులు అల్లాడుతున్నారు

## - రైతు సదస్సులో కేటీఆర్

- యువతను మోసం చేసిన కాంగ్రెస్‌ను తెలంగాణలోనూ తరిమికొడతారు
- రేవంత్ రెడ్డి ఒక్కడు దొరికితే యువత పొట్టు పొట్టు కొట్టేటట్టు ఉన్నదన్న కేటీఆర్
- కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందని విమర్శ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రైతులు నీళ్లు అడిగితే పొలాల్లో బీఆర్ఎస్ నేతల రక్తం చల్లాలని సీఎంరేవంత్ మాట్లాడుతున్నారని "రక్తం చల్లుమంటావా నా కొడుకా తీసుకో, కానీ రైతులకు నీళ్లు ఇవ్వు!" అని తీవ్రంగా విరుచుకుపడ్డారు. లక్సెట్టిపేట రైతు సదస్సులో కేటీఆర్ ప్రసంగించారు. గోదావరి నీళ్లు ఏపీకి తరలిపోతుంటే, పట్టిసీమ నడుస్తుంటే ఇక్కడ పట్టించుకోరా.? మాట మాట్లాడితే 'ఏ జాతి నీది' అని అడుగుతారా.? మాది పోరంబోకు జాతి కాదు వలసపాలకుల సంక నాకే దగుల్బాజీ జాతి అసలే కాదు అని గట్టికౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. యువత, రైతాంగం రేవంత్ రెడ్డి వైఖరిపై

2లో..

# ఎన్యూమరేషన్ ఫామ్‌ల కోసం ఆధార్ తప్పనిసరి కాదు

## - తెలంగాణ సీఈవో కీలక ప్రకటన




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫామ్‌లు నింపడానికి ఆధార్ కార్డు తప్పనిసరి కాదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అయితే, దరఖాస్తు ఫారాలు నింపే సమయంలో ఆధార్ వివరాలు సమర్పించడం తప్పనిసరి అని కొందరు భావిస్తుండటంతో సీఈవో ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. ఆధార్ కార్డు లేని కారణంగా ఏ ఒక్క అర్హుడు కూడా ఓటు హక్కును కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.ఆధార్ కార్డు అందుబాటులో లేని అర్హులైన పౌరులు, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు లేదా కొత్తగా నమోదు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. అర్హులైన ప్రజలందరూ

2లో..

# స్టార్ట్ ప్ టూ... స్కై హై...

**హైదరాబాద్,** శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుండి జూలై 18, శనివారం, మధ్యాహ్నం 12:05 ఎంకి విక్రమ్-1 ప్రయోగం ప్రారంభమైంది. 17 నిమిషాల తర్వాత, ఇది తన పేగులకు సంబంధించిన ఉపకరణాలను విజయవంతంగా విడుదల చేసింది. ఈ ఘనతకు 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్‌లో సంబరాలు గట్టిగా జరిగాయి. ఈ తొలి ప్రయోగం, 'ఆగమన్' అని పిలువబడింది, భారతదేశాన్ని ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యం కలిగిన మూడవ దేశంగా నిలిపింది. అయితే, తెలంగాణకు ఇది ఒక దశాబ్ద కాలం పాటు ఆవిష్కరణ వ్యవస్థను నిర్మించడానికి పెట్టిన పెట్టుబడికి ఫలితం. ఈ ప్రయాణం 2015 నవంబరులో ప్రారంభమైంది, అప్పటి ఐటీ మరియు పరిశ్రమల మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో టీ హబ్ ప్రారంభమైంది, ఇది అప్పటివరకు భారతదేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇన్క్యుబేటర్. ప్రారంభోత్సవంలో, రతన్ టాటా దీనిని 'భారతదేశానికి కొత్త ముఖం' అని పేర్కొన్నారు. ఈ చుట్టూ, రాష్ట్రం విస్తృతమైన నెట్‌వర్క్‌ను నిర్మించింది - ప్రోటోటైపింగ్ కోసం టీ వర్క్స్, మహిళా వ్యాపారులకు, నైపుణ్యాలు, పరిశోధన మరియు అకాడమియా-ఇండస్ట్రీ సంబంధాల కోసం టాస్క్, రిచ్ తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ సెల్. స్కైరూట్ ఎయిరోస్పేస్ ఈ వ్యవస్థలో జన్మించింది. 2018లో, మాజీ ఇస్రో శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన మరియు నాగ భరత్ డాకా స్థాపించిన ఈ కంపెనీ, ౧-ఊబీఎలో ప్రారంభ సంవత్సరాలలో ఇన్క్యుబేట్ చేయబడింది, మెంటార్షిప్, పెట్టుబడిదారుల ప్రాప్తి మరియు వ్యాపార మద్దతు పొందింది. ఇది డ్రాయింగ్‌ల నుండి హార్డ్‌వేర్‌కు మారుతున్నప్పుడు, తన ఇంజనీర్లకు ప్రోటోటైపింగ్ సౌకర్యాలను అందించింది, దీని ద్వారా భాగాలను డిజైన్ చేయడం, పరీక్షించడం మరియు మెరుగుపరచడం జరిగింది. దీని వల్ల సాధించిన ఫలితాలు త్వరగా వచ్చాయి. 2022 నవంబరులో, స్కైరూట్ యొక్క ఉపఆర్బిటల్ విక్రమ్-ఎస్, ఇస్రో యొక్క సౌకర్యాల నుండి రాకెట్‌ను ప్రయోగించిన తొలి భారతీయ ప్రైవేట్ కంపెనీగా నిలిచింది. టీ హబ్ లో జరిగిన ఒక వేడుకలో, కేటీఆర్ దీనిని భారతదేశం యొక్క అంతరిక్ష సాంకేతిక పరిశ్రమకు 'నిజంగా చరిత్రాత్మక క్షణం' అని పేర్కొన్నాడు. 'ఇది హైదరాబాద్ నుండి మరింత మంచిగా జరగలేదు' అని చెప్పాడు మరియు రాష్ట్రంలో దేశంలోని తొలి సమగ్ర రాకెట్ డిజైన్, తయారీ మరియు పరీక్షా సౌకర్యం కోసం ప్రోత్సహించాడు. 'వారు తమ రాకెట్లను ఇతర ప్రాంతాలకు పంపకూడదు' అని ఆయన అన్నారు. 2025 నవంబరులో, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హైదరాబాద్‌లోని స్కైరూట్ యొక్క ఇన్ఫినిటీ క్యాంపస్‌లో ఫ్లైట్-రెడీ విక్రమ్-1ను ఆవిష్కరించారు. 2026 మే నాటికి, ఈ కంపెనీ భారతదేశంలోనే తొలి స్పేస్ టెక్ యూనికార్న్‌గా మారింది. రెండు నెలల తర్వాత, ఇది ఉపగ్రహాలను ఆకాశంలోకి పంపించింది. విక్రమ్-1, సుమారు 20 మీటర్ల ఎత్తు, 350 కిలోల బరువున్న చిన్న ఉపగ్రహాలను తక్కువ భూమి కక్ష్యలోకి తీసుకెళ్లగలదు - ఇది హైదరాబాద్‌ను ప్రపంచ చిన్న ఉపగ్రహాల మ్యాప్‌లో బలంగా నిలబెట్టింది మరియు నగరానికి కొత్త రకం ప్రొపల్షన్, ఉపగ్రహ మరియు ఎయిరోస్పేస్-మటీరియల్స్ స్టార్టప్‌లను ఆకర్షించింది.

# ఫలించిన 22 ఏళ్ల పోరాటం

**మెదక్,** ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసిత రైతుల 22 ఏళ్ల పోరాటం ఫలించింది. కందుకూరు మండలం లేమూరులోని సర్వే నంబర్ 102లో అభివృద్ధి చేసిన ప్లాట్లను కేటాయించేందుకు రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు అంగీకరించారు. ఆరుగురు సీఎంలకు విన్నవించి, ఇటీవల మూడు నెలల పాటు దీక్షలు చేసిన రైతుల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మార్గం సుగమమైంది. ఈ మేరకు 23 మంది సీలింగ్ పట్టాదారులకు 325 చ.గజాలు, కాస్తులో ఉన్న 148 మందికి 200 చ.గజాల చొప్పున ప్లాట్లు దక్కనున్నాయి. అయితే 38ఈ పట్టాదారుల సమస్య పరిష్కారం కావాల్సి ఉంది.ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసితుల సుదీర్ఘ పోరాటం ఎట్టకేలకు 22 సంవత్సరాల తర్వాత ఫలించింది. నిర్వాసిత రైతులకు రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం లేమూరులో ప్లాట్లు కేటాయించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జీహెచ్ఎంసీ పరిధిలోని తుక్కుగూడ డివిజన్ పరిధిలోని రావిర్యాల, జెన్నాయిగూడ గ్రామాల్లో మొత్తం 730.17 ఎకరాల భూమిని 2003-04లో అప్పటి ప్రభుత్వం ఏపీఐఐసీ కోసం సేకరించింది. ఇందులో కొండలు, గుట్టలు ఉన్న ప్రాంతాన్ని మినహాయించి.. మిగిలిన 679.13 ఎకరాలకు పరిహారంగా జెన్నాయిగూడ వద్ద 35 ఎకరాలను అభివృద్ధి చేసి ప్లాట్ల రూపంలో కేటాయిస్తామని అప్పట్లో ప్రతిపాదించారు. అయితే.. ఆ సమయంలో కేటాయించిన ప్యాకేజీకి 38ఈ పట్టా రైతులు అంగీకరించకపోవడంతో కేటాయింపు ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వాలు మారడంతో బాధితులకు న్యాయం జరగలేదు.ఈ సమస్య పరిష్కారం కోసం భూనిర్వాసిత రైతులు గత 22 ఏళ్లుగా విరామం లేకుండా పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటి వరకు దాదాపు ఆరుగురు ముఖ్యమంత్రుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. 2003లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబును, 2006లో వైఎస్ రాజశేఖరరెడ్డిని కలిశారు. ఆ తర్వాత కొణిజేటి రోశయ్య, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలకు వినతిపత్రాలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ విషయాన్ని కేసీఆర్, కేటీఆర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టే సమయంలో మళ్లీ ప్రభుత్వం మారింది. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గత మూడు నెలలుగా రిలే నిరాహారదీక్షలు చేపట్టడం గమనార్హంఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేఎల్ఆర్.. బాధితుల సమస్యను ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని టీజీఐఐసీ ఎండీని ఆదేశించింది. దీంతో స్పందించిన అధికారులు కందుకూరు మండలం లేమూరులోని సర్వే నంబరు 102లో ఉన్న 130 ఎకరాల అసైన్డ్ భూమిని అభివృద్ధి చేసి రైతులకు ప్లాట్లు ఇవ్వడానికి అంగీకరించారు.

## హైదరాబాద్‌లో కొత్తగా మరో 15 రిటైల్ మాల్స్..

**హైదరాబాద్,** హైదరాబాద్‌లో రిటైల్ రంగానికి లభిస్తున్న ఆదరణతో మరో 15 కొత్త మాల్స్ ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం 30కి పైగా మాల్స్ ఉండగా.. కొత్తగా 6 గ్రేడ్-1, పలు గ్రేడ్-2 మాల్స్ జతకానున్నాయి. సంధ్య లులూ, ఫోరం మాల్, వంశీరామ్, బ్రూక్‌ఫీల్డ్ వంటి దిగ్గజ మాల్స్ రాబోతున్నాయి. కాగా, నిర్వహణ భారం, ఆధునిక పోటీ తట్టుకోలేక పాత మాల్స్ క్రమంగా ఆస్పత్రులు, కామర్షియల్ టవర్లుగా మారుతున్నాయి. మరోవైపు నగరంలోని అన్ని దిక్కులా మాల్స్ కల్చర్ విస్తరిస్తున్నట్లు అనరాక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.హైదరాబాద్ మహానగరంలో రిటైల్ రంగం శరవేగంగా విస్తరిస్తోంది. మాల్స్ సంస్కృతి నగరంలో కొత్త శిఖరాలకు చేరుకుంటోంది. తాజాగా అందిన వివరాల ప్రకారం.. ఈ సంవత్సరాంతానికి లేదా వచ్చే ఏడాది నాటికి గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా కొత్తగా మరో 15 మాల్స్ ప్రారంభం కానున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే నగరంలో చిన్నవి, పెద్దవి కలిపి 30కి పైగా మాల్స్ అందుబాటులో ఉన్నాయి. దేశంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి అని అనరాక్ వంటి ప్రముఖ రియల్ ఎస్టేట్ పరిశోధనా సంస్థలు వెల్లడిస్తున్నాయి.ఒకప్పుడు కేవలం సెంట్రల్ హైదరాబాద్ ప్రాంతానికే పరిమితమైన మాల్స్, ఇప్పుడు నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ అంటూ నగర నలుమూలలకూ విస్తరించాయి. కొత్తగా రాబోతున్న వాటిలో ఆరు మాల్స్ గ్రేడ్-1 కేటగిరీకి చెందినవిగా ఉండనున్నాయి. దీంతో నగరంలో గ్రేడ్-1 మాల్స్ సంఖ్య 9 నుంచి 15కి చేరనుంది. మరోవైపు.. కొత్తగా అత్యాధునిక మాల్స్ రూపుదిద్దుకుంటుండటంతో పాత మాల్స్ నిర్వహణ తీవ్ర భారంగా మారి తెరమరుగయ్యే పరిస్థితి నెలకొంది. కొన్ని పాత మాల్స్ ఇప్పటికే ఆస్పత్రులుగా, వాణిజ్య సముదాయాలుగా రూపాంతరం చెందుతుండగా.. మరికొన్ని మాల్స్ నిర్మాణ దశలోనే ఇతర వాణిజ్య సంస్థలుగా మారిపోతున్నాయి.నగరంలో రాబోతున్న ప్రధాన గ్రేడ్-1 మాల్స్ చూసినట్లయితే.. నార్సింగి వద్ద దేశంలోనే అతిపెద్ద మాల్స్‌లో ఒకటిగా సంధ్య లులూ మాల్ రానుంది. రాజేంద్రనగర్‌లోని ప్రెస్టీజ్ సిటీలో దాదాపు 12 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫోరం మాల్ నిర్మితమవుతోంది. గచ్చిబౌలి పరిసరాల్లో యూనిటీ మాల్, నార్సింగి వద్ద లగ్జరీ మాల్‌గా వంశీరామ్ మాల్, కోకాపేట వద్ద ఏరియా బై ఫెయిర్‌మౌంట్, కర్మాన్‌ఘాట్ వద్ద కొలీసియం మాల్ రూపుదిద్దుకుంటున్నాయి. వీటితో పాటు నానక్‌రామ్‌గూడ వద్ద ఎస్ఏఎస్ ఐ-టవర్స్ రిటైల్, రాయదుర్గంలో బ్రూక్‌ఫీల్డ్ కే రహేజా కార్ప్ మాల్, డౌన్ టౌన్ మాల్స్ అందుబాటులోకి రానున్నాయి.వీటితో పాటు మీడియం అండ్ కమ్యూనిటీ కేటగిరీ కింద రాబోతున్న గ్రేడ్-2 మాల్స్ నగరంలో రీజినల్ రిటైల్ అవసరాలను తీర్చనున్నాయి. హస్తినాపురంలో హెచ్ఎస్ఆర్ ఆర్క్ మాల్, మణికొండలో రామిరెడ్డి మాల్, బాలానగర్‌లో స్టార్ లైట్ మాల్, బండ్లగూడ పరిసరాల్లో టాప్రా మాల్ నిర్మాణంలో ఉన్నాయి. ఆధునిక సౌకర్యాలు, విశాలమైన పార్కింగ్, అంతర్జాతీయ బ్రాండ్లతో వస్తున్న ఈ కొత్త మాల్స్ రాకతో హైదరాబాద్ రిటైల్ మార్కెట్ స్వరూపమే మారిపోనుంది.

# 78 మండలాల్లో కరువు జాడలు

**హైదరాబాద్,** తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు లేక రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. తెలంగాణలోనూ వానలు కురియడం లేదు. అనేక మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. తాగు, సాగు నీటికి కూడా ఇబ్బందికరంగా మారింది. వానలు లేకపోవడంతో ప్రాజెక్టుల్లో నీరు లేదు. తెలంగాణ ఎక్కువగా భూగర్భ జలాల పై ఆధారపడి సేద్యం సాగుతుంది. కానీ విపరీతమైన ఎండల కారణంగా చాలా బోర్లు ఎండిపోయాయి. అనేక మండాలలను కరువు పరిస్థితులు ప్రకటించడానికి ప్రభుత్వం సిద్ధమయింది. ఎల్ నినో ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తుంది.మరొకవైపు జులై నెలలో చల్లదనాన్ని నిండుకుని ఉండే తెలంగాణ నేటికీ వేసవి కాలాన్ని తలపిస్తుంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా మేరకు ఈరోజు వానలు అక్కడకక్కడ పడతాయని, తేలికపాటి వానలు మాత్రమే పడతాయని చెప్పింది. ఈ కరువు నుంచి బయటపడాలంటే కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిందే.ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి రెండు నెలలు గడుస్తున్నా, రాష్ట్రంలోని 78 మండలాల్లో చుక్క వర్షం కూడా పడలేదు. చెరువులు పూర్తిగా ఎండిపోయి, పంట పొలాలు కష్టాల్లో ఉన్నాయి. వాతావరణ శాఖ తెలిపిన సమాచారం ప్రకారం, రాష్ట్రంలో సగటున 24 రోజులే వర్షాలు కురిసినట్లు తెలుస్తోంది. పలు జిల్లాల్లో పది రోజులు కూడా వర్షం కురవలేదని అధికారులు పేర్కొన్నారు. నేలలో తేమ ఆరిపోయి, నాటిన విత్తనాలు మాడిపోతున్నాయి. కొన్ని మొలకెత్తినప్పటికీ, అవి వాడిపోయి నేలవాలుతున్నాయి. ఈ పరిస్థితి రైతుల ఆశలను మరింతగా దెబ్బతీస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా 462 మండలాల్లో లోటు వర్షపాతం నమోదవుతోంది. ములుగు జిల్లాలో మాత్రమే వర్షపాతం సాధారణ స్థాయిని మించి ఉంది. ములుగు జిల్లాలో 343.2 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా, 350 మిల్లీ మీటర్ల వర్షం పడింది. కానీ, మిగతా జిల్లాల్లో 33 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుండి జులై 19 వరకు సాధారణంగా 254.3 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉంది, కానీ కేవలం 170.7 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసాయి. గత సంవత్సరం ఇదే కాలంలో 204.3 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది, అయితే ఈసారి పరిస్థితి మరింత కష్టంగా ఉంది.సాధారణంగా జులైలో నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల ఎక్కువ వర్షాలు కురుస్తుంటాయి. కానీ ఈసారి 53 శాతం లోటు వర్షపాతం నమోదవుతోంది. జూన్ నుండి సెప్టెంబర్ వరకు సాధారణంగా 740.6 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉంది, కానీ ఇప్పటి వరకు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. జూన్‌లో 130.3 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 115.3 మిల్లీ మాత్రమే కురిసింది. జులైలో 227.4 మిల్లీ వర్షం పడాల్సి ఉంది, కానీ 61.5 మిల్లీ మాత్రమే కురిసింది. ఈ పరిస్థితి రైతుల సాగుకు తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలంలో గోదావరి నది కూడా వెలవెలబోతుంది. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడుతున్న కరవు పరిస్థితుల వల్ల దాదాపు 2 వేల ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. వాజేడు, ఏటూరునాగారం, మంగంపేట, వెంకటాపురం మండలాల్లో రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు

# ముందుకు సాగని ఎస్ ఐఆర్

**హైదరాబాద్,** హైదరాబాద్ ూఎఖీ ప్రక్రియ సజావుగా నడవటం లేదు. బీఎల్ఓలు ఎన్యుమరేషన్ ఫారంలను పంపిణీ చేసి తిరిగి ఇవ్వాలని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. హైదరాబాద్ లో మాత్రం బీఎల్ఓలు ూఎఖీ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనడం లేదు. హైదరాబాద్ నగరం పరిధి ఎక్కువ కావడం, అపార్ట్ మెంట్లు ఎక్కువగా ఉండటంతో వాచ్ మెన్ కు ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చి వెళ్లిపోయే వారి సంఖ్య ఎక్కువగా కనపడుతుంది. ఎన్యుమరేషన్ ఫారాలు నింపడానికి అవసరమైన సలహాలు, సూచనలు కూడా చేయకపోవడంతో బీఎల్ఓలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి వరకూ ఇరవై శాతం మాత్రమే ఎన్యుమరేషన్ జరిగిందని చెబుతున్నారు. బీఎల్ఓలు పెద్దగా పట్టించుకోకపోవడంతోనే ూఎఖీ ప్రక్రియ సజావుగా నడవడం లేదు. పైగా బీఎల్ఓలు ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేయడంలో సహకరించాల్సింది పోయి అసలు పట్టీపట్టన్నట్లు వ్యవహరించడంతోనే ఈ ప్రక్రియ సజావుగా జరగడం లేదు. అనేక మంది తమకు ఓట్లు ఉన్నా లేకపోయినా పరవాలేదు అనుకునే దశకు చేరుకున్నారు. బీఎల్ఓలు నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని అంటున్నారు. .. దీనికి బీఎల్ఓలను ప్రశ్నిస్తే తాము వచ్చి ఫారాలు నింపేందుకు సహకరించలేమని, తమకు మంచినీళ్లు కూడా ఇవ్వడం లేదని ఎదురుదాడికి దిగుతున్నారు. అనేక ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. హైదరాబాద్ లో అపార్ట్ మెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటన్నింటికీ ఎక్కి దిగాలంటే కష్టమే. కానీ తమకు మంచి నీళ్లు ఇవ్వలేదని, టీ అడగలేదంటూ కుంటిసాకులు చెబుతూ ూఎఖీ ప్రక్రియ ను నీరుగార్చడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇప్పటికైనా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకోకపోతే ఆగస్టు 3వ తేదీ వరకూ పెంచినా ఈ ూఎఖీ ప్రక్రియ సజావుగా పూర్తి కాదన్న వాస్తవం గ్రహించాలి.

## అంగరంగ వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం





**హైదరాబాద్** ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ భక్తులు,పుర ప్రముఖులు అధిక సంఖ్యలో అమ్మ వారి కళ్యాణాన్ని తిలకించారు. బల్కంపేట్ ఎల్లమ్మ అమ్మ వారి కళ్యాణ మహోత్సవం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.ఈ కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి తిలకించారు. తదుపరి అమ్మవారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా సీఎం కుటుంబ సభ్యులు, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు, కొండా సురేఖ కుటుంబ సభ్యులు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ కుటుంబ సభ్యులు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య రెడ్డి, శాసనసభ్యులు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, నవీన్ యాదవ్ ల రాకతో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో గౌరవ స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ అమ్మ వారి కళ్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులు, పుర ప్రజలకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పించడం జరిగింది.దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ చైర్మన్ సాయిబాబా,కళ్యాణ మహోత్సవ నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. త్రాగునీరు విద్యుత్ నిరంతరంగా ఏర్పాటు చేపట్టారు. భక్తులకు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరికి అమ్మవారి కళ్యాణం తికలించేలా, దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేపట్టారు. కళ్యాణం తదుపరి కూడా అమ్మవారిని దర్శించుకొనుటకు భక్తులు ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఈ కళ్యాణ మహోత్సవంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా,డిసిపి ట్రాఫిక్ కాజల్ సింగ్, జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ఈవో వినోద్ రెడ్డి, విద్యుత్ జిహెచ్ఎంసి, హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్, మెడికల్, రెవెన్యూ, దేవాదాయ శాఖ, పోలీస్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పీఎంఎఫ్ఎంఈ యూనిట్ల సబ్సిడీని నేరుగా 'స్త్రీ నిధి' ఖాతాకే ఇవ్వాలి

**- కేంద్రాన్ని కోరిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**న్యూ ఢిల్లీ,** పీఎంఎఫ్ఎంఈ పథకం అమలుపై కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఓనీఈఖఎ) అధికారులతో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమావేశం అయ్యారు. స్త్రీ నిధి లోన్ ద్వారా ఏర్పాటయిన పీఎంఎఫ్ఎంఈ యూనిట్ల సబ్సిడీని నేరుగా 'స్త్రీ నిధి' ఖాతాకే ఇవ్వాలని కేంద్రానికి మంత్రి విజ్ఞప్తి చేసారు. 'స్త్రీ నిధి' ద్వారా ఇచ్చే పీఎంఎఫ్ఎంఈ రుణాలకూ ఏఐఎఫ్ నిధుల నుంచి వడ్డీ రాయితీ సౌకర్యం కల్పించాలని ప్రతిపాదించారు. జిల్లా, మండల సమాఖ్యలను జిల్లా వనరుల సంస్థలుగా (ఆఖీూబ) గుర్తించాలని కోరారు. మంత్రి ప్రతిపాదనలపై కేంద్ర కార్యదర్శి అవినాష్ ప్రకాశ్ జోషి, సంయుక్త కార్యదర్శి దేవేష్ దేవల్ సానుకూలంగా స్పందించి, ప్రాధాన్యతతో పరిశీలిస్తామని హామీ ఇచచారు. తరువాత అయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడితో భేటీ అయ్యారు. విశాఖ విమానాశ్రయంలో 'స్వయం' బ్రాండ్ ఉత్పత్తుల విక్రయ కేంద్రానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేసారు. 'స్వయం' స్టాల్ ఏర్పాటుపై జీఎంఆర్ (ఉఓఖీ) విమానాశ్రయ యాజమాన్యాన్ని కూడా కోరారు. విశాఖ ఎయిర్పోర్ట్లో 'స్వయం' ఉత్పత్తుల స్టాల్ కేటాయింపునకు అవసరమైన సహకారం అందిస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ నిర్ణయాల ద్వారా రాష్ట్రంలోని ూఊఉ మహిళా పారిశ్రామికవేత్తలకు మెరుగైన ఉపాధి, మార్కెట్ అవకాశాలు వుంటాయి.

## సెంట్రల్ నియోజకవర్గ కార్యకర్తల సమక్షంలో బొండా నైషా పాప 2వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

మంగళవారం ఉదయం సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుల కార్యాలయంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బొండా ఉమామహేశ్వరరావు గారి మనవరాలు బొండా నైషా పాప 2వ జన్మదిన వేడుకలను సెంట్రల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముందుగా ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు గారు కేక్ కట్ చేసి నైషా పాపకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కార్యకర్తలు నైషా పాపకు ఆశీస్సులు అందిస్తూ మిఠాయిలు పంచుకుని వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సెంట్రల్ నియోజకవర్గం ఒక కుటుంబం అయితే, ఆ కుటుంబానికి వారసురాలిగా బొండా నైషా పాప అందరి అభిమానాన్ని చూరగొంటోందని అన్నారు. చిన్న వయస్సులోనే తన చలాకీతనం, చిరునవ్వుతో అందరినీ ఆకట్టుకుంటున్న నైషా పాప నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అలాగే తన తండ్రి బొండా సిద్ధార్థ గారి సేవా స్ఫూర్తిని, తన తాత బొండా ఉమామహేశ్వరరావు గారి ప్రజాసేవా భావాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవ చేసే గొప్ప వ్యక్తిగా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో:- పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నైషా పాపకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహబూబాబాద్ జేఎన్టీయూ హెచ్ విద్యార్థుల ఆందోళన

**మహబూబాబాద్** పట్టణంలోని జేఎన్టీయూ హెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో తాగునీరు, హాస్టల్ మౌలిక వసతుల కొరతపై విద్యార్థులు క్లాసులు బహిష్కరించి నిరసన చేపట్టారు. 30 మందికి ఒకే బాత్రూమ్ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రిన్సిపాల్, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించి, అదనపు బాత్రూమ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణంలో అరుదైన ఘటన

**హైదరాబాద్** బల్కంపేట రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవంలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఉత్సవాలకు హాజరైన సీఎం రేవంత్రెడ్డి సతీమణి గీతారెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఒకరికొకరు మర్యాదపూర్వకంగా పూలదండలు వేసుకొని ఆత్మీయతను చాటుకున్నారు. ఈ అరుదైన క్షణం అక్కడ ఉన్న భక్తులు, నాయకుల దృష్టిని విశేషంగా ఆకట్టుకుంది. తరువాత వారంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డ్ కు వైష్ణవి బాయిఎంపిక



**బేతంచేర్ల :** బేతంచెర్ల మండల పరిధిలోనీ బుగ్గానిపల్లి తండా గ్రామానికి చెందిన రవి నాయక్,సులోచన బాయి,ల కుమార్తె వైష్ణవి బాయి,షైనింగ్ స్టార్స్ కు ఎంపిక అయింది విద్యా రంగంలో చూపిన విశేష ప్రతిభకు గుర్తింపుగా సోమవారం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డు కార్యక్రమంలోన్యాయ శాఖ మంత్రి యన్ యం డి ఫరూక్,జిల్లా కలెక్టర్ రాజకుమారి,చేతుల మీదుగా సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డును అందుకుంది.ఈ అవార్డు వైష్ణవి బాయి,విద్యా ప్రగతి, క్రమశిక్షణ,అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది.ఈ అవార్డు రావడంతో ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,గ్రామ పెద్దలు, విద్యార్థులు వైష్ణవి బాయి,కి అభినందనలు తెలిపారు.

## గంజహళ్లి గ్రామా అభివృద్ధిని కాదు అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకుంటాం

**- గోనెగండ్ల వైసీపీ**



**గోనెగండ్ల** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం మండలకేంద్రమైన గోనెగండ్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నీయోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ఆదేశాఖమేరకు మండలనాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చెర్మెన్ మన్సూర్, మహేష్ రెడ్డి, తోలు రాముడు మల్లేష్ మాట్లాడుతూ గత వారం క్రితం గంజహళ్లి గ్రామ చెరువును పరిశీలించిన రాజీవ్ రెడ్డి, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెరువు మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని మాట్లాడిన మాటలకూ టీడీపీ నాయకులు ఏమి మాట్లాడాలో తెలియక అనవసరంగా రాజీవ్ రెడ్డిని విమర్శిస్తున్నారని.కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయినా ప్రజలకు చెప్పుకోదగ్గ మేలు జరగలేదని విమర్శించారు.రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు సూపర్ సిక్స్ హామీల పేరుతో మోసపోయారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని.ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, 2029 ఎన్నికల్లో ప్రజలు మరోసారి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించి అధికారంలోకి తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గంజహళ్లి గ్రామ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

## రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ నంబర్ తీసుకోవాలి



**సి.బెళగల్, జూలై 21:** "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా సి.బెళగల్, కంబదహల్ గ్రామాల్లో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి. మల్లేష్ కుమార్ మాట్లాడారు.పంటల బీమా, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ (రైతు విశిష్ట సంఖ్య) చేయించుకోవాలని సూచించారు. నమోదు కోసం ఆన్‌లైన్-1బి, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, మొబైల్ తీసుకుని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు.ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో పత్తి పంటలో ప్రస్తుతం పురుగుల ఉధృతి లేనందున పురుగుమందులు పిచికారీ చేయకుండా, అవసరమైన ఎరువులు మాత్రమే వేయాలని రైతులకు సూచించారు. అలాగే పత్తి పంట బీమా నమోదు ఈ నెల 31 వరకు, వరి పంట బీమా నమోదు ఆగస్టు 15 వరకు కొనసాగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# శ్రీధర్ బాబు జోక్యంతో మంథని అభివృద్ధికి వేగం

**50 పడగల దవాఖాన**
**మంథని మున్సిపల్ కొత్త ఆఫీస్.**
**ఆర్డిఓ ఆఫీస్ స్థానంలో కొత్త ప్రభుత్వ ఆఫీసులు**
**డిపో నుండి బంక్ వరకు 100 ఫీట్ల రోడ్డు.**
**పెద్దపెల్లి నుండి కాటారం వరకు ఫోర్ లైన్ రోడ్డు**





మంథని ( ప్రశ్న న్యూస్) మంథనినియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసన వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య సదుపాయాలు, పట్టణ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ పలు కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రధానంగా పెద్దపల్లి -కాటారం ఫోర్‌లైన్ రహదారి, మంథని పట్టణంలో 100 అడుగుల వెడల్పు రహదారి, నూతన మున్సిపల్ కార్యాలయం, ఆధునిక ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, అలాగే 50 పడకల ఆసుపత్రి వంటి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొంటున్నారు. మంత్రి శ్రీధర్ బాబు ప్రజలతో నేరుగా మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. మంథని నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో విద్య, వైద్యం, తాగునీరు, రవాణా, పట్టణ మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఆయన పలుమార్లు వెల్లడించారు. తన తండ్రి, మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని, అదే బాటలో మంథని అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తానని శ్రీధర్ బాబు పలుమార్లు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేస్తున్నారు.





# సింగరేణిలో అద్దె వాహనాల జోరు..హోరు

**- పనితీరుపాఐ పలు విమర్శలు**

**భద్రాద్రి** మణుగూరు ఏరియా సింగరేణి జీఎం కార్యాలయంలో అద్దె వాహనాల నిర్వహణపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్మిక చట్టాలు, సింగరేణి నిబంధనలను పక్కనపెట్టి అద్దె వాహనాల నిర్వహణ సాగుతోందని, డ్రైవర్లతో శ్రమ దోపిడీ చేయడంతో పాటు పీఎఫ్ చెల్లింపుల్లోనూ అవకతవకలు జరుగుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం ఏరియా కార్మిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వాహన టెండర్ నిబంధనలకు విరుద్ధంగా అద్దె వాహనాల నిర్వహణ జరుగుతోందని, వాహనం నడిపేది ఒకరైతే పీఎఫ్ మాత్రం మరొకరి పేరుపై జమ అవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వాస్తవంగా విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత వంటి చట్టబద్ధమైన హక్కులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తమవుతోంది. కార్మికుల ఆరోపణల ప్రకారం, రోజుకు 16 గంటలు నడిచే వాహనాలకు ఒకే డ్రైవర్ ను, 24 గంటలు నడిచే వాహనాలకు ఇద్దరు డ్రైవర్లతోనే విధులు నిర్వహింపజేస్తున్నారని చెబుతున్నారు. నిబంధనల ప్రకారం అవసరమైన సంఖ్యలో డ్రైవర్లను నియమించాల్సి ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అయితే బిల్లుల్లో మాత్రం ముగ్గురు డ్రైవర్ల పేర్లు చూపిస్తూ చెల్లింపులు జరుగుతున్నాయని, వాస్తవంగా పని చేసే డ్రైవర్ల సంఖ్య మాత్రం తక్కువగా ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం వెనుక జీఎం కార్యాలయంలోని ఓ ఉద్యోగి కీలకంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వాహనాల బిల్లుల చెల్లింపులు, కాంట్రాక్టర్లతో సమన్వయం లో సదరు ఉద్యోగి ప్రభావం ఉందని కార్మికులు ఆరోపిస్తున్నారు. వాహన యజమానుల నుండి నెలవారీగా భారీగా నజరానలు పొందుతున్నారనే చర్చ జోరుగా సాగుతుంది. వాహన యజమానులతో కలిసి సదరు ఉద్యోగి నెలవారి బిల్లుల చెల్లింపులో చేతివాటం ప్రదర్శిస్తూ, కార్యాలయ సమయం ముగిసిన కూడా అదే అద్దె వాహనాలలో తిరుగుతూ వాహన యజమానులతో కలిసి పార్టీలతో పబ్బంగడుపుతున్నారని విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి




**ఆత్మకూరు** ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ దీక్ష కు కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు కే దినేష్ కుమార్ సిఐటియు ఆత్మకూర్ పట్టణ కార్యదర్శి రామ్ నాయక్ ఎస్ఎఫ్ఐ కే సాయికుమార్ లు అన్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని ర్యాలీ నిర్వహిస్తూ నీట్ పేపర్ లీకేజీ కి భాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని అలాగే గత 21 రోజులుగా డిల్లీ లో సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష కు కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు సోమవారం నాడు స్థానిక ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ కేజీ రోడ్డు నుండి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలపడం జరిగిందని వారు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయంలో వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఒక్క నీట్ పేపర్ వరసగా లీకేజీ అవుతుందని అన్నారు. ఔం అసమర్థత స్పష్టంగా కనపడుతున్నది ఇది బీజేపీ జేబు సంస్థలాగా పని చేస్తుందని అన్నారు. ఎన్నో వేల, లక్షల మంది విద్యార్థులు మరియు తల్లిదండ్రుల కలను నిరాశ కలిగించేలా చేశారన్నారు వారు అన్నారు. పేపర్ లీకేజీ వల్ల అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. ఇవన్ని కేంద్ర ప్రభుత్వ హత్యలే అన్నారు. నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన రాజీనామా చేయాలని నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గత 21 రోజులుగా పర్యావరణవేత్త సామాజిక కార్యకర్త సోనం వాంగ్చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రభుత్వం ఎటువంటి స్పందన లేకపోవడం దారుణం అన్నారు. సోనం వాంగ్ చుక్ కి ఏమి జరిగినా అది కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుంది అన్నారు. ఇప్పటికే సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ప్రమాదకర స్థితిలో ఉన్నదని ప్రభుత్వం స్పందించి ఆయనతో చర్చలు జరపాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని దీనికి ప్రభుత్వం స్పందించి ఆయన దీక్షను విరివింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా మరియు రాష్ట్ర,దేశవ్యాప్తంగా వేల మంది విద్యార్థులతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ఇంటి ముట్టడైన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ నాయకులు అక్మల్, వెంకటేష్, బన్నీ, కైఫ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ సారెతో ఇంద్రకీలాద్రికి
# పోటెత్తిన మహిళా భక్తులు

**ఇంటి ఇలవేల్పుగా కనకదుర్గమ్మకు పసుపు, కుంకుమ, చీర-సారెల సమర్పణ.**
**భక్తుల సౌకర్యాలపై ఈవో సీనా నాయక్ సమీక్ష**





విజయవాడ(ప్రశ్న న్యూస్) ఆషాఢ మాసం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మను ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, సారెలను సమర్పిస్తున్నారు. ఆషాఢ సారె ఉత్సవాల్లో ఏడో రోజైన మంగళవారం ఆలయంలో మహిళా భక్తుల రద్దీ కొనసాగింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారెలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) సీనా నాయక్ మహామండపం ఆరో అంతస్తును సందర్శించి భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. సారె సమర్పించేందుకు వచ్చిన మహిళా భక్తులతో నేరుగా మాట్లాడి దర్శనం, ప్రసాదాల పంపిణీ, అన్నప్రసాదం తదితర ఏర్పాట్లపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భక్తులు ఆలయ అధికారులు కల్పించిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఈ నెల జూలై 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శాకాంబరి ఉత్సవాల ఏర్పాట్లపై ఈవో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని దర్శనం, భద్రత, తాగునీరు, ప్రసాదాలు, అన్నప్రసాదం, క్యూలైన్ల నిర్వహణ తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పవిత్ర సారె సమర్పణ కార్యక్రమం భక్తుల్లో విశేష భక్తిశ్రద్ధలను పెంపొందిస్తోందని, ఆలయం కల్పిస్తున్న ప్రసాదం, అన్నప్రసాదం, ఇతర సౌకర్యాలపై భక్తులు హర్షం వ్యక్తం చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. వచ్చే శాకాంబరి ఉత్సవాలను కూడా వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

# కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు సన్మానం



**జమ్మికుంట** మంగళవారం ఇల్లందకుంట మండల కేంద్రానికి వన మహోత్సవ కార్యక్రమానికి వచ్చిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి పూల బుకే అందించడం జరిగింది. అనంతరం వనమహోత్సవం కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గొడిశాల పరమేష్, ఎడ్ల కిషన్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు అమరేందర్ రెడ్డి,గుండారపు సాయి, తదితరులు పాల్గొన్నారు..

# ఎల్ నినో సవాళ్లపై తెలంగాణ సర్కార్ ప్రణాళిక

**హైదరాబాద్,** ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఎల్ నినో వంటి మార్పులు రాష్ట్ర ప్రజలపై, ముఖ్యంగా వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రభావం చూపకుండా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం దూరదృష్టితో పక్కా ప్రణాళికలు రూపొందిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల పెరుగుదల నుంచి తెలంగాణ సంసిద్ధత వరకు" అనే అంశంపై రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సుకు ఆయన రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. 'కేవలం పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా ఎల్ నినో ప్రభావంపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. సమస్య తీవ్రతను ముందే గ్రహిస్తే ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం సొంతంగా సరైన ప్రణాళికలు వేసుకోగలుగుతుంది.' అని భట్టి విక్రమార్క అన్నారు. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్రంలో జరిగే ఉష్ణోగ్రతల మార్పులు తెలంగాణలోని చెరువులు, వాగులు, గ్రామాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో శాస్త్రవేత్తల ద్వారా విశ్లేషింపజేసి, సమర్థవంతమైన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. తాగునీరు, సాగునీటితో పాటు పశువులు, పక్షులు, అడవి జంతువుల నీటి, ఆహార అవసరాలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. వ్యక్తిగత, కుటుంబ, గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఎవరికి వారు సంసిద్ధమయ్యేలా ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైనా రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు నిపుణుల సూచనల మేరకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని భట్టి తెలిపారు.

ఈ సమాచారాన్ని ప్రత్యక్ష ప్రసారాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ తీసుకెళ్లడంలో టీవీ ఛానెళ్లు తమ సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నాయని అభినందించారు. ?మన జీవన విధానంలో విద్యుత్ అత్యంత ప్రధానమైనదని, ఎల్ నినో వల్ల పెరిగిన డిమాండ్‌ను తట్టుకునేందుకు ప్రభుత్వం అత్యంత సమర్థవంతమైన 'ఎనర్జీ మేనేజ్‌మెంట్' అమలు చేస్తోందని వివరించారు. పగటి పూట విరివిగా, తక్కువ ధరకు లభించే సౌర విద్యుత్‌ను (సోలార్ పవర్) గరిష్టంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజలపై, ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. సోలార్ సమయాన్ని సమర్థవంతంగా వాడుకుంటూ, తదుపరి అవసరాలకు థర్మల్ విద్యుత్‌ను క్రమబద్ధంగా వినియోగించడం ద్వారా గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతున్నామని స్పష్టం చేశారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో పగలు, రాత్రి అనే తేడా లేక ఫ్యాన్లు, ఏసీలు, లైట్లు, బోర్‌వెల్స్, లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల వాడకం భారీగా పెరిగిందన్నారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. సాధారణంగా వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉంటుంది, కానీ ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో ప్రస్తుత డిమాండ్ ఏప్రిల్ (వేసవి) నాటి గరిష్ట (పీక్) స్థాయికి చేరుకుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సీజన్లకు అనుగుణంగా విద్యుత్ వినియోగంలో మార్పులు వస్తున్నాయని, పెరిగిన అవసరాలకు తగ్గట్టుగా ఎనర్జీ ప్లానింగ్ రూపొందించుకోవడంలో తెలంగాణ ముందుంటుందని తెలిపారు. ఏసీలు, ఫ్యాన్లు, మోటార్ల వాడకంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. సమాజంలో చైతన్యం తీసుకురావడానికి విషయ నిపుణులను ఆహ్వానించి ఈ సదస్సును ఏర్పాటు చేసిన ప్లానింగ్ శాఖను ఉప ముఖ్యమంత్రి అభినందించారు. వ్యవసాయ, విద్యుత్, సాగునీటి భూగర్భ జల శాఖలతో పాటు అనుబంధ శాఖలన్నింటినీ సమన్వయం చేసుకుని సదస్సును నిర్వహించడం ప్రణాళికా శాఖ ప్రతిభకు, సామాజిక బాధ్యతకు నిదర్శనమని కొనియాడారు. ఇటువంటి అవగాహన సదస్సులను భవిష్యత్తులో జిల్లాల వారీగా కూడా నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేస్తూ పూర్తి స్థాయి చైతన్యం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పాలనాధికారులు తమ విధులతో పాటు సమాజానికి మేలు చేసే ఇటువంటి అంశాలలో ప్రజలను చైతన్యవంతం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఐఏఎస్ అధికారులు దివ్య దేవరాజన్, గోపి, జితేష్ వి పాటిల్ ప్లానింగ్ డైరెక్టర్ రూఫొస్ దత్తం తదితరులు పాల్గొన్నారు.

# అతివేగంగా, పెద్ద శబ్దాలతో వాహనాలు నడుపు ప్రజలను ఇబ్బందులు పెడితే సహించం

**.- యువత ఆదర్శంగా ఉంటూ ప్రమాదాలకు దూరంగా ఉండాలి....**

**- సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ**

**కోదాడ టౌన్:** నిబంధనలకు విరుద్ధంగా బైక్‌ల సైలెన్సర్లు మార్చి, అధిక శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వాహనదారులపై కోదాడ పట్టణ, కోదాడ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. సైలెన్సర్ లు మార్చి అధిక శబ్దంతో పట్టణంలో ఇష్టారాజ్యంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవడం కోసం స్పెషల్ నిర్వహించారని ఎస్పి నరసింహ తెలిపినారు, ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా సీజ్ చేసిన 40 మోడిఫైడ్ సైలెన్సర్లను మంగళవారం పోలీసులు రోడ్డు రోలర్‌తో తొ?క్కించి ధ్వంసం చేశారు. కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో జిల్లా ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. మితిమీరిన శబ్దాలు చేస్తూ ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, రోగులు, చిన్న పిల్లలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు కంపెనీ సైలెన్సర్లను మాత్రమే వాడాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. పట్టణంలో ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని ఎస్పీ తెలిపారు. యువత ఆదర్శంగా ఉండాలి రోడ్డు ప్రమాదాలకు గురి కావద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్స్పెక్టర్ శివ శంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు పై ఫోకస్: సిపి.సజ్జనార్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)నేరాల నియంత్రణ కోసం హైదరాబాద్ సిటీ పోలీసులు "జీరో టాలరెన్స్" విధానాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, పలు నేరాలలో నిందితుడిగా ఉన్న బొజ్జ భాగ్యరాజు పై పిడి చట్టం అమలు చేస్తూ హైదరాబాద్ సిపి సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేయగా చిలకలగూడ పోలీసులు పిడి చట్టం అమలు చేశారు. ప్రతినిత్యం నేర ప్రవృత్తితో ఉంటూ కరడుగట్టిన నేరస్తుడిగా పేరొందిన భాగ్యరాజుపై మూడోసారి పిడి చట్టాన్ని అమలు చేసినట్లు సిపి సజ్జనార్ తెలిపారు. వరుసగా హింసాత్మక నేరాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు, అభద్రతా భావాన్ని సృష్టిస్తూ ప్రజా శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న నేపథ్యంలో అతనిపై చర్యకు ఉపక్రమించారు. హైదరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఇతనిపై మొత్తం 15 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇందులో హత్యాయత్నం, అల్లర్లు, తీవ్ర గాయాలు కలిగించడం, బెదిరింపులు, పోక్సో చట్టం కింద నేరాలు, ఇతర తీవ్రమైన నేరాలు ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా నేరాలకు పాల్పడుతూ సంఘవిద్రోహ శక్తులుగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పౌరులు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

## మేడ్చల్ బాలుర ఉన్నత పాఠశాల ఇక 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'

**రూ.కోట్లతో మౌలిక వసతులు**

**1500 మంది విద్యార్థుల వరకు సకల సౌకర్యాలు పాఠశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )మేడ్చల్ బాలుర ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా తీర్చిదిద్దేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. అందులో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్ మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పాఠశాలను సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. ఈ నూతన విలీన ప్రక్రియలో భాగంగా మేడ్చల్ బాలికల ఉన్నత పాఠశాల, గిర్మాపూర్ బాలుర పాఠశాలలతో పాటు చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలన్నింటినీ ఇందులో కలిపి విస్తరించనున్నారు. దీనివల్ల ఈ ప్రాంగణంలో విద్యార్థుల సంఖ్య సుమారు 1500కు చేరనుంది. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలో అత్యాధునిక లైబ్రరీలు, అంతర్జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ మరియు ఫుట్‌బాల్ కోర్టులతో పాటు వివిధ క్రీడా సౌకర్యాలను అందుబాటులోకి తేవడానికి ప్రత్యేక బడ్జెట్ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మారడం వల్ల రానున్న రోజుల్లో విద్యార్థులకు అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో పాటు అన్ని రకాల ఆధునిక వసతులు సమకూరనున్నాయి. ఈ కార్యక్రమంలో ఈడబ్ల్యూఐడీసీ ఈఈ రామ్ కుమార్, ఏఈ ప్రసాద్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి శంకరయ్య మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంత పద్మనాభం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మామిడ్యాలలో మహిళా సంఘం భవన నిర్మాణానికి ఘనంగా భూమిపూజ

- మహిళల సాధికారతకు మరో ముందడుగు
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు నిజమైన భరోసా
- మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల గ్రామం (ఆర్అండ్ఆర్ కాలనీ)లో నూతనంగా నిర్మించనున్న మహిళా సంఘం భవనానికి ఆయన ఘనంగా భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో పారదర్శక ప్రజాపాలన కొనసాగుతోందని, మహిళల సాధికారత, పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మలి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఎడ్ల పోచయ్య, వంటిమామిడి మార్కెట్ వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్తా, జిల్లా ప్రజాగళ కాంగ్రెస్ ప్రజా సంఘటన అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ మోహన్, మాజీ సర్పంచ్ సత్యచారి, ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు ప్రదీప్ రెడ్డి, అనిల్ చారి, రంగయ్య, పచ్చమట్ల కవిత, కృష్ణ గౌడ్, కాంగ్రెస్ నాయకులు జీడికంటి స్వామి, దాచారం రాజు, మహిళా సంఘ నాయకురాలు పి. విజయ, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గుంటూరు ఘటనపై రాజకీయ రగడ

### మహిళల భద్రతపై మాట్లాడే నైతిక హక్కు అంబటి రాంబాబుకు లేదని టీడీపీ నేతల విమర్శలు



గుంటూరు(ప్రశ్న న్యూస్) గుంటూరులో జరిగిన మహిళపై దాడి ఘటన నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్ రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మహిళల రక్షణ గురించి అంబటి రాంబాబు మాట్లాడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. అవినీతి, అనైతిక ప్రవర్తనకు బ్రాండ్ అంబాసిడర్‌గా పేరొందిన వ్యక్తి మహిళల భద్రతపై వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

#### గళ్ళా మాధవి వెంటనే స్పందించారని టీడీపీ నేతల వ్యాఖ్యలు

గుంటూరులో జరిగిన ఘటన ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి వచ్చిన వెంటనే ఆమె బాధిత కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు పోలీసు అధికారులతో మాట్లాడి నిందితులపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసేలా చర్యలు తీసుకున్నారని నేతలు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులే ఎమ్మెల్యే తమకు అండగా నిలిచారని స్పష్టంగా చెబుతున్నప్పటికీ, వైఎస్సార్సీపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం ఈ ఘటనను ఉపయోగించుకోవాలని ప్రయత్నించడం దురదృష్టకరమని వారు ఆరోపించారు.

#### కక్షసాధింపు రాజకీయాలే లక్ష్యమని ఆరోపణ

కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై చేసిన వ్యాఖ్యల కేసులో అంబటి రాంబాబు జైలుకు వెళ్లాల్సి వచ్చిందని, అందుకు ఎమ్మెల్యే గళ్ళా మాధవినే కారణంగా భావించి ఆమెపై కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే దేవుడికి తలనీలాలు సమర్పించిన సందర్భంలో కూడా ఆమెపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేయించారని విమర్శించారు.

#### ప్రజాదరణను చూసి ఓర్వలేక ఆరోపణలు

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్ రావు మాట్లాడుతూ, గళ్ళా మాధవి ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ మహిళల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. తక్కువ కాలంలోనే ఆమె ప్రజల విశ్వాసాన్ని సంపాదించారని, అదే ప్రజాదరణను చూసి కొందరు రాజకీయంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. గళ్ళా మాధవిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అంటే బీసీ, బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని, ఇటువంటి వ్యాఖ్యలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్రంగా ఖండిస్తారని హెచ్చరించారు.

#### ఆధారాలు లేని ఆరోపణలను ప్రజలు నమ్మరన్న టీడీపీ

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, గళ్ళా మాధవి ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న నాయకురాలని పేర్కొన్నారు. ఆమె పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అంబటి రాంబాబు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ ఎప్పటినుంచో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, గళ్ళా మాధవి కూడా అదే స్ఫూర్తితో ప్రజలకు సేవ చేస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాలతో రాజకీయ ప్రయోజనం పొందాలనే ప్రయత్నాలను ప్రజలు తిరస్కరిస్తారని, అభివృద్ధి అంశాలపై చర్చకు తాము ఎప్పుడైనా సిద్ధమని స్పష్టం చేశారు.

## మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ:ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**మహిళా గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ**

**అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కారానికి హామీ**



గుంటూరు(ప్రశ్న న్యూస్) గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో మహిళల నుంచి పలు వినతులు స్వీకరించి వారి సమస్యలను ఓపికగా విని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలు స్థల వివాదాలు, పెన్షన్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ, సంక్షేమ పథకాల అమలు, రేషన్ కార్డు సమస్యలు, టిడ్కో ఇళ్ల మంజూరు, జీవనోపాధి అవకాశాలు తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సిరిపురపు అనురాధ అనే మహిళ తన రేషన్ కార్డులో కారు ఉన్నట్లు నమోదవడంతో సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందలేకపోతున్నానని, ఆ నమోదును తొలగించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మరో మహిళ కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించి ఆర్థిక సహాయం అందించాలని కోరగా, ఇంకొకరు టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. శ్రీనివాసరావుపేటకు చెందిన మహిళ జీవనోపాధి కోసం తోపుడు బండి మంజూరు చేయాలని కోరగా, ఏటి అగ్రహారం 4వ లైన్‌కు చెందిన మహిళ తమ పొరుగింటి యజమాని ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వల్ల తమ ఇంటి గోప్యతకు భంగం కలుగుతోందని ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. వినతులన్నింటినీ సంబంధిత శాఖల అధికారులకు పంపించి, ప్రతి సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. గుంటూరు యువ ఇంజినీర్‌కు అభినందనలుభారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల విజయాలకు ప్రతీకగా నిలిచిన స్కైరూట్ ఏరోస్పేస్ రాకెట్ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ ఇంజినీర్‌గా పనిచేసిన గుంటూరుకు చెందిన కుటుంబరాయుడు పూరుబండిని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందించారు. ఆయన సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, యువతకు ఆయన స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. స్టాంప్ రైటర్ల సమస్యలపై హామీస్టాంప్ రైటర్ల ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి తమ వృత్తికి సంబంధించిన సమస్యలను వివరించారు. జీవనోపాధికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ వినతిపత్రం అందజేశారు. వారి సమస్యలను కూడా సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.

## ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్న

- దేవాదాయ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్
- నూతన బాధ్యతల అనంతరం
- శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ట్రిబ్యునల్ (ఏపీఈటీ) నూతన చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన రిటైర్డ్ జిల్లా జడ్జి ఎ. భారతి మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. నూతన చైర్‌పర్సన్ రాక సందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డిప్యూటీ ఈఓ) కిషోర్ కుమార్ ప్రత్యేక దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించి, ఆలయ మర్యాదలతో దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం ఆలయ వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా, ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి, శ్రీ కనకదుర్గమ్మ చిత్రపటాన్ని జ్ఞాపికగా బహూకరించారు. నూతన బాధ్యతలు చేపట్టిన అనంతరం దేవీ దర్శనం చేసుకోవడం విశేషంగా నిలిచింది. ఆలయ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సింహగిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

**32 కిలోమీటర్ల మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్**

**భక్తుల భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి వార్షిక సింహగిరి ప్రదక్షిణకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, దేవస్థానం ఈవో వెంకటరావుతో కలిసి కలెక్టర్ 32 కిలోమీటర్ల ప్రదక్షిణ మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లుంబినీ పార్కు నుంచి ఎంవీపీ సర్కిల్, ఇసుకతోట, సీతమ్మధార, మురళీనగర్, జాతీయ రహదారి, ఎన్ఎస్‌టీఎల్, కుమారి కళ్యాణ మండపం మీదుగా తొలి పావంచ వరకు బస్సులో ప్రయాణిస్తూ ఏర్పాట్లను సమీక్షించారు. రహదారుల మరమ్మతులు, విద్యుత్ దీపాల ఏర్పాటు, భూగర్భ కేబులింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, భక్తుల కోసం వేచిచూడే ప్రదేశాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, భూగర్భ కేబులింగ్ పనులను వేగంగా పూర్తి చేసి రహదారులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో ప్రదక్షిణ చేసే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రదక్షిణ మార్గమంతా 30 అసిస్టెన్స్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు ఆరు నుంచి ఏడు ప్రాంతీయ కంట్రోల్ రూమ్‌లు, హనుమంతువాకలో ప్రధాన కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మొత్తం ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. ప్రతి అసిస్టెన్స్ సెంటర్‌లో పోలీసు, దేవస్థానం, రెవెన్యూ తదితర శాఖల సీనియర్ అధికారులను అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో వైద్య బృందాలు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని పోలీసు, రవాణా శాఖలకు సూచించారు. జాతీయ రహదారి, శ్రీకాకుళం, అనకాపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలకు అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని, హనుమంతువాక నుంచి మద్దిలపాలెం వరకు రద్దీ తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ట్రాఫిక్ మార్పులపై ప్రజలకు ముందుగానే విస్తృతంగా సమాచారం అందించాలని సూచించారు. ప్రదక్షిణ మార్గంలోని హెల్త్ సిటీ, విద్యాసంస్థలు, ఐటీ సంస్థలతో సమన్వయం చేసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏటా సింహగిరి ప్రదక్షిణకు భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులు సురక్షితంగా, ప్రశాంతంగా ప్రదక్షిణ పూర్తి చేసుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నగర ప్రజలు, భక్తులు అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులపట్ల నిర్లక్ష్యంపై కలెక్టర్ కఠిన చర్య

- యడవల్లి బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కొండయ్య సస్పెండ్

**మార్కాపురం** విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి కల్పించడంలో నిర్లక్ష్యం వహించినందుకు యడవల్లి బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కొండయ్యను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ విజయ సునీతఉత్తర్వులు జారీ చేశారు. ఎడవల్లి వార్డెన్ కొండయ్య గిద్దలూరు, కొమరోలు బీసీ హాస్టళ్లకు ఇన్చార్జిగా కూడా ఉన్నారు. అయితే గిద్దలూరు బాయ్స్ హాస్టల్ నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని ఆరోపణలు వచ్చాయి. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించకపోవడంతో ఆగ్రహించిన విద్యార్థులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. ఈ ఘటనపై వార్తాపత్రికల్లో కథనాలు రావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. తనిఖీల్లో బయటపడిన నిజాలుసహాయ బీసీ సంక్షేమ అధికారి హాస్టల్‌లో తనిఖీ చేయగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అనంతరం జిల్లా బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి కూడా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. వసతి గృహంలోని విద్యార్థులు తమకు జరిగిన అన్యాయాన్ని అధికారికి వివరించారు. ఈ మేరకు సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించగా, కలెక్టర్ వెంటనే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. కొండయ్యను విధుల నుంచి విడుదల చేసి అనుమలవీడు వార్డెన్‌గా మురళిను నియమించారు. గిద్దలూరు బీసీ బాయ్స్ హాస్టల్అల్లినగరం వార్డెన్ సంగతాల శ్రీనివాసులు ఇన్చార్జికొమరోలు బీసీ హాస్టల్ అదే ప్రాంతంలోని బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ రోజా ఇన్చార్జివిద్యార్థుల సంక్షేమంలో రాజీ లేదని, నిర్లక్ష్యం చేసే అధికారులపై ఇలాంటి కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ‘ముఖ్బీర్ : ది స్టోరీ ఆఫ్ ఎ స్పై’మూవీ రివ్యూ!



కశ్మీర్ పై పట్టు సాధించడానికి పాకిస్థాన్ చేసే ప్రయత్నాలు .. వాళ్ల వ్యూహాలను తెలుసుకుని వాటిని అడ్డుకోవడానికి ఇండియా నుంచి ‘రా’కి సంబంధించిన స్పై ఏజెంట్లు అక్కడికి వెళ్లడం .. ప్రాణాలకు తెగించి వెళ్లిన పనిని పూర్తి చేయడం వంటి కథలతో ఇంతవరకూ చాలా సిరీస్ లు .. సినిమాలు వచ్చాయి. అలాంటి ఒక నేపథ్యంలో గతంలో సిరీస్ గా వచ్చినదే ‘ముఖ్బీర్ : ది స్టోరీ ఆఫ్ ఎ స్పై’. 2022లో రూపొందిన ఈ సిరీస్ ను ఇప్పుడు సినిమాగా ‘జీ 5’ ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి తీసుకుని వచ్చారు. ఈ నెల 10వ తేదీ నుంచి తెలుగులోను అందుబాటులోకి వచ్చింది.అది 1965 ప్రాంతం .. ఇండియా – పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉంటాయి. కశ్మీర్ లోని ప్రతి ఇంటిపై పాకిస్థాన్ జెండా ఎగరాలనే పట్టుదలతో పాక్ ఉంటుంది. అందుకోసం వాళ్లు చేసే కుట్రలను పసిగట్టి, అక్కడే వాటిని సమాధి చేయవలసిన అవసరాన్ని ‘రా’ గుర్తిస్తుంది. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా ఉండాలంటే, ‘రా’కి సంబంధం లేని వ్యక్తిని పాక్ కి పంపించడమే సరైనదని ‘రా’ అధికారి మూర్తి (ప్రకాశ్ రాజ్) భావిస్తాడు. అందుకోసం అతను ‘కమ్రాన్’ ను ఎంపిక చేస్తాడు. ‘కమ్రాన్’ (జైన్ ఖాన్ దురాని) చాలా తెలివైనవాడు . ఎదుటివ్యక్తిని చాలా ఈజీగా బురిడీ కొట్టించడంలో అతను నేర్పరి. తనకి అవసరమైన రహస్య సమాచారాన్ని అందించడం కోసం మూర్తి అతణ్ణి నియమించుకుంటాడు. అందుకు తగిన పారితోషికం ఇస్తుంటాడు. ఇప్పుడు ‘రా’కి సంబంధించిన పనిపై అతణ్ణి పాకిస్థాన్ కి పంపించడానికి సిద్ధమవుతాడు. గతంలో ఒక రెస్టారెంట్ లో జరిగిన అగ్నిప్రమాదంలో ఒక ఫ్యామిలీ చనిపోతుంది. ఆ ఫ్యామిలీకి సంబంధించిన ‘అర్ఫాన్’ బాడీ మాత్రం దొరకదు. అర్ఫాన్ పెదనాన్న ‘షమీమ్’ పాకిస్థాన్ లో ఉంటూ ఉంటాడు. అందువలన కమ్రాన్ ను ఆర్ఫాన్ పేరుతో షమీమ్ దగ్గరికి పంపించడానికి మూర్తి ప్లాన్ చేస్తాడు. ఆ ఫ్యామిలీకి సంబంధించిన అన్ని విషయాలను వివరించి అక్కడికి పంపిస్తాడు. ప్రమాదకరమైన అధికారులు కీలకమైన పదవులను నిర్వహిస్తూ ఉండగా, ఆ గడ్డపైకి కమ్రాన్ అడుగుపెడతాడు. అక్కడ అతనికి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? వాటిని అతను ఎలా అధిగమిస్తాడు? అనేదే కథ.కశ్మీర్ పై పట్టు సాధించడానికి పాకిస్థాన్ పన్నాగాలు పన్నుతూ ఉంటుంది. ఆ కుట్రలను కూల్చేయడానికిగాను, డిపార్టుమెంటుకు సంబంధం లేని వ్యక్తిని పంపించడమే మంచిదని ‘రా’ భావిస్తుంది.’కమ్రాన్’ అనే ఆ యువకుడు మారు పేరుతో పాకిస్థాన్ నేలపై అడుగుపెడతాడు. అక్కడ అతను ఎదుర్కొనే పరిణామాలు ఎలాంటివి? అనే ఆసక్తికరమైన అంశం చుట్టూనే ఈ కథ తిరుగుతూ ఉంటుంది. అటు పాకిస్థాన్ అధికారుల పన్నాగాలు, ఇటు ‘రా’ అధికారుల వ్యూహాలు .. ఈ మధ్యలో హీరో సాగించే అన్వేషణను కలుపుకుంటూ ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లారు.హీరో ఢిల్లీ నుంచి బయల్దేరి పాకిస్థాన్ కి చేరుకోవడం దగ్గర నుంచి అసలు కథ మొదలైనట్టుగా ప్రేక్షకులు భావిస్తారు. ఇక ఇక్కడి నుంచి కథ ఒక రేంజ్ లో స్పీడ్ అందుకుంటుందని అనుకుంటారు. కానీ అంత తొందరేం ఉంది అన్నట్టుగా కథ నిదానంగానే నడుస్తూ ఉంటుంది. ఇక్కడి అధికారులు .. అక్కడి అధికారులు ఎవరికీ వారు చాలా కూల్ గా మంతనాలు చేస్తుంటారు. స్పై గా వెళ్లిన హీరో కూడా అంతే కూల్ గా తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోతుంటాడు. ఇక్కడ ఎవరికి ఎలాంటి కంగారు లేదన్నమాట. పాకిస్థాన్ .. రక్షణ వ్యవస్థకి సంబంధించిన కీలకమైన అధికారులు .. అలాంటి వాళ్లను కూడా హీరో చాలా తేలికగా కలుసుకుంటాడు. వాళ్లు కూడా తాము అనుకున్న పనిని ఇతను మాత్రమే చేయగలడని నమ్ముతారు. పోనీ అంత చురుకైనవాడిగా హీరోగారు అప్పటివరకూ ఏమైనా ఘన కార్యాలు చేశాడా అంటే అదీ లేదు. ఒకానొక సందర్భంలో అతను ఘొల్లుమని ఏడుస్తాడు. అతనిపై ఏదో ఒక మూలన కాస్త నమ్మకం పెట్టుకున్న అభిమానులకు, ఆ క్షణం నుంచి అది కూడా లేకుండా పోతుంది.ఈ తరహా కథలలో దేశభక్తితో పాటుగా లవ్ .. ఫ్యామిలీ ఎమోషన్స్ .. యాక్షన్ సీన్లు .. ఛేజింగులను ఒక రేంజ్ లో ప్రేక్షకులు ఊహించుకుంటారు.

ఒళ్లు గగుర్పొడిచే ట్విస్టులను ఆశిస్తారు. ఇది కదా మనం కోరుకునేది అనేంతగా ఉద్వేగానికి లోనయ్యే దృశ్యాల కోసం వెయిట్ చేస్తారు. అయితే అలాంటి అంశాలకు చాలా దూరంగానే ఈ కథను నడిపించారు అది కూడా చాలా నిదానంగా .. నింపాదిగా. నిర్మాణ విలువలు .. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం ఫరవాలేదు. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తుంది. హీరో పాత్రతో పాటు ప్రకాశ్ రాజ్ .. ఇతర సీనియర్ నటుల పాత్రలను కూడా సమర్థవంతంగా మలచలేకపోయారని అనిపిస్తుంది. వెబ్ సిరీస్ ను సినిమాగా ఆవిష్కరించేటప్పుడు కంటెంట్ ను మరింత టైట్ చేసుకుని రావలసి ఉంటుంది. అలాంటి జాగ్రత్తలు తీసుకుని ఉంటే కాస్త బెటర్ గా ఉండేదేమో. లొకేషన్స్ కీ .. 1965 కాలం నాటి వాతావరణాన్ని క్రియేట్ చేయడంలోని కృషికి ఎక్కువ మార్కులు పడతాయని చెప్పచ్చు.

# హృదయాల్ని కదిలించే ప్రణయం



కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం ‘చెన్నై లవ్‌స్టోరీ’. రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ఎస్‌కేఎన్, సాయిరాజేష్ నిర్మాతలు. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తి చేసుకుంది.

యు.ఏ సర్టిఫికెట్ లభించింది. ఇటీవల వచ్చిన ప్రేమకథా చిత్రాల్లో ఇది విభిన్నంగా ఉందని సెన్సార్ వారు ప్రశంసించారని, ప్రచార చిత్రాలకు కూడా అద్భుతమైన స్పందన లభిస్తున్నదని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. చెన్నై నగర నేపథ్యంలో హృద్యమైన ప్రేమకథగా మనసుల్ని కదిలిస్తుందని దర్శకుడు తెలిపారు శ్రీగౌరిప్రియ, సిరి హన్మంతు, మహేందర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కథ: సాయిరాజేష్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రవి నంబూరి.

# ఎడబాటు మిగిల్చిన వేదన



సూపర్‌స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం ‘శ్రీనివాస మంగాపురం’. అజయ్‌భూపతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశ్వనీదత్ సమర్పణలో పి.కిరణ్ నిర్మిస్తున్నారు. ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్‌ను వేగవంతం చేశారు. సోమవారం ఈ సినిమా నుంచి ‘రావే చెలియా’ అనే పాటను విడుదల చేశారు. జీవీ ప్రకాష్‌కుమార్ స్వరపరచిన ఈ పాటకు నాగార్జున రెడ్డి సాహిత్యాన్నందించారు. కపిల్ కపిలన్ ఆలపించారు. ప్రేమికుల జీవితాల్లో ఎడబాటు మిగిల్చిన ఆవేదనను వ్యక్తం చేస్తూ ఈ పాట సాగింది. విజువల్స్ పాటలోని ఉద్వేగాల్ని మరింత ఎలివేట్ చేసేలా ఉన్నాయి. రాషా తడాని కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో సీనియర్ నటుడు మోహన్‌బాబు కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్.

# ఆజాద్ హింద్ ‘ఫౌజీ’?



పాత్ర చిత్రణ, కథ, కథనం.. ఈ మూడూ సినిమా విజయంలో ప్రధాన భూమిక పోషిస్తుంటాయి. వీటి విషయంలో దర్శకుడు అప్రమత్తంగా ఉంటే చాలు.. విజయం తథ్యం. దర్శకుడు హను రాఘవపూడి ‘ఫౌజీ’ చిత్రం విషయంలో ఈ జాగ్రత్తలన్నీ తీసుకుంటూ ముందుకెళ్తున్నారు. ఆయన గత విజయం ‘సీతారామం’ విషయంలోనూ ఇదే రీతిని అనుసరించారాయన. ‘ఫౌజీ’లో ప్రభాస్ పాత్ర తీరుతెన్నుల గురించి ఆసక్తికరమైన వివరాలు ప్రస్తుతం వెలుగు చూశాయి.

ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపిస్తారని ముందునుంచీ చెబుతూనే ఉన్నారు. అయితే.. కథ రీత్యా ముందు ఆయన బ్రిటీష్ ఇండియన్ ఆర్మీ సైనికుడిగా కనిపిస్తారట. ఆ తర్వాత నేతాజీ సుభాష్ చంద్రబోస్ ‘అజాద్ హింద్ ఫౌజ్’ స్థాపించడంతో నేతాజీ నేతృత్వంలో స్వాతంత్ర్య పోరాటం సాగించేందుకు తాను కూడా అజాద్ హింద్ ఫౌజ్‌లో చేరతాడట. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఓ సైనికుని కథగా ఈ సినిమా సాగుతుందని టాక్. ఇందులో ప్రభాస్ పాత్ర.. ధైర్య సాహసాలతో, త్యాగం, దేశభక్తితో నిండి ఉంటుందని వినికిడి. ఇమాన్వి కథానాయిక నటిస్తున్న ఈ చిత్రంలో అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుందట. మైత్రీ మూవీమేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

## అర్థం చేసుకోకుండా కామెంట్స్ చేస్తారు..

# నెట్టింట నెగెటివిటీపై రకుల్ ప్రీత్ సింగ్




తెలుగు, తమిళం, హిందీ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ రకుల్ ప్రీత్ సింగ్. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ భామ అప్పడప్పుడు నెటిజన్లు, అభిమానులతో తన అభిప్రాయాలను షేర్ చేసుకుంటుంది. తాజాగా సోషల్ మీడియాలో పెరుగుతున్న నెగెటివిటీ గురించి మాట్లాడింది. సోషల్ మీడియా అనేది కొందరు జనాలు ముక్కుమొఖం తెలియని అకౌంట్లతో తరచూ కఠిన వ్యాఖ్యలు చేస్తూ నెగెటివిటీని ప్రచారం చేసే హబ్‌లాంటిది. చాలా మంది వ్యక్తులు అజ్ఞాత ప్రొఫైల్స్‌తో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. వారు చేస్తున్నకామెంట్ల ప్రభావం ఎలా ఉంటుందో కనీసం అర్థం చేసుకోరని చెప్పింది. అందరినీ మెప్పించడం అసాధ్యమన్న రకుల్ ప్రీత్ సింగ్ సెలబ్రిటీలు ఆన్‌లైన్‌లో వచ్చే అనవసరమైన ట్రోల్స్, విమర్శల వల్ల తమ ఫోకస్ మార్చుకోకూడదు. నెగెటివిటీని ఎదుర్కొనేందుకు వాటిని పట్టించుకోకుండా వ్యక్తిగత, వృత్తి పరమైన లక్ష్యాలపైన దృష్టి పెట్టడమే ఉత్తమ మార్గమనని చెప్పుకొచ్చింది. ఇండియన్ 2 సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన రకుల్ ప్రీత్ సింగ్.. స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం రణ్ బీర్ కపూర్ నటిస్తోన్న రామాయణలో కీలక పాత్రలో నటిస్తోంది. రకుల్ నటించిన ్రాఘ్అ ్రాఘ్అఆ ాబతీ ఔశీష్ట్ర ఇశీ ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఈ భామ నెక్ట్స్ ఇండియన్ 3 చేయాల్సి ఉంది. మరి తెలుగు సినిమాలో ఎప్పుడు కనిపిస్తుందో చూడాలి.

# నెగెటివ్ రోల్‌లో ఐశ్వర్య?



వైవిధ్యమైన కథాంశాల్ని ఎంచుకుంటూ దక్షిణాదిలో ప్రతిభావంతురాలైన కథానాయికల్లో ఒకరిగా పేరు తెచ్చుకుంది ఐశ్వర్యరాజేష్. అయితే ఈ భామకు తెలుగులో మాత్రం కాస్త ఆలస్యంగానే బ్రేక్ దొరికింది. గత ఏడాది ‘సంక్రాంతికి వస్తున్నాం’ చిత్రంతో తెలుగులో ఆమె తొలి బ్లాక్‌బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం తమిళ, కన్నడ సినిమాలో బిజీగా ఉన్న ఈ అమ్మడు తెలుగులో ఓ బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర కథానాయకుడు బాలకృష్ణ–కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా ప్రకటన రోజు నుంచి వార్తల్లో నిలుస్తున్నది. గాడ్ ఆఫ్ మాసెస్‌గా అభిమానులు పిలుచుకునే బాలకృష్ణ.. సామాజిక అంశాల మేళవింపుతో మాస్ కథాంశాల్ని తెరకెక్కించడంలో సిద్ధహస్తుడైన దర్శకుడు కొరటాల శివ కలయిక వెండితెరపై సంచలనాల్ని సృష్టించడం ఖాయమని అభిమానులు ధీమాగా ఉన్నారు. త్వరలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఇందులో ఐశ్వర్యరాజేష్ ఓ కీలక పాత్రకు ఎంపికైందని తెలిసింది. నెగెటివ్ షేడ్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని, కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# సెలబ్రేషన్‌లో రౌడీ జనార్ధన




అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ నటిస్తున్న ప్రతిష్టాత్మక రూరల్ యాక్షన్ డ్రామా ‘రౌడీ జనార్ధన’. రవికిరణ్ కోలా దర్శకుడు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది.

డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సోమవారం దర్శకుడు రవికిరణ్ కోలా పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు చిత్రబృందం శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ సినిమా సెట్స్ నుంచి ఆయన వర్కింగ్ స్టిల్స్‌ని విడుదల చేశారు. ‘రౌడీ జనార్ధన’ చిత్రాన్ని రవికిరణ్ ఎంత ప్యాషనేట్‌గా, కాన్ఫిడెంట్‌గా తెరకెక్కిస్తున్నారో ఈ స్టిల్స్ చూస్తే అర్థమవుతున్నది. కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో డా.రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కెమెరా: ఆనంద్ సి.చంద్రన్.

# వరదతో దెబ్బతిన్న తాత్కాలిక రహదారి

# పరీక్షలో వ్యక్తి మార్పిడి

**- ఇద్దరికి 3 ఏళ్ల జైలు**

**రూ.10 వేల జరిమానా విధించిన ములుగు కోర్టు**

**పదో తరగతి పరీక్షలో మోసం: కోర్టు కఠిన తీర్పు**

**అభ్యర్థికి బదులు బాబాయి పరీక్ష రాయగా 3 ఏళ్లు శిక్ష**

**మాల్‌ప్రాక్టీస్‌కు కఠిన శిక్ష**

**ములుగు కోర్టు తీర్పు.. విద్యార్థులకు హెచ్చరిక**



ములుగు(ప్రశ్న న్యూస్)పదో తరగతి పబ్లిక్ పరీక్షలో అసలు అభ్యర్థికి బదులు మరొకరు పరీక్ష రాసిన కేసులో ములుగు కోర్టు కఠిన తీర్పు వెలువరించింది. ఇద్దరు నిందితులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది.ములుగు ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోత్స్న మంగళవారం ఈ తీర్పు ఇచ్చారు.

**ఇలా వెలుగులోకి వచ్చింది.**

2017లో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా ఈ ఘటన జరిగింది. జగన్నాథం నాగార్జున తన బాబాయి జగన్నాథం సాంబయ్యకు బదులుగా పరీక్ష కేంద్రానికి వెళ్లాడు. పరీక్ష సమయంలో హాల్‌టికెట్లు, గుర్తింపు వివరాలను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్‌కు హాల్‌టికెట్‌లోని ఫొటోకు, పరీక్ష రాస్తున్న వ్యక్తికి పోలిక లేకపోవడంతో అనుమానం వచ్చింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు గుర్తించి ములుగు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు కేసును కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాలు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన కోర్టు నిందితులపై అభియోగాలు రుజువయ్యాయని తీర్పు చెప్పింది.

**ఎస్పీ అభినందన.**

ఈ కేసు దర్యాప్తు నుంచి విచారణ వరకు సమర్థవంతంగా వ్యవహరించిన డీఎస్పీ కిషోర్ కుమార్, ఎస్ఐ నాగరాజు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, కోర్టు కానిస్టేబుల్ నరేష్‌తో పాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడేవారిపై చట్టం కఠినంగా ఉంటుందని, విద్యార్థులు నిజాయితీతో పరీక్షలు రాయాలని సూచించారు.

## ఐటీడీఏలో అధికారుల కొరత..

## గిరిజన సంక్షేమం అగమ్యగోచరం

**ఏపీఓ.ఏవో.ఎస్ఓ పోస్టులు ఖాళీ.. తుడుం దెబ్బ ఆగ్రహం**

**వెంటనే భర్తీ చేయకుంటే ఉద్యమం తప్పదు: పులిసే బాలకృష్ణ**



ఏటూరునాగారం(ప్రజాన్యూస్) తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐటీడీఏ ఏటూరునాగారం నేడు అచేతన స్థితిలో ఉందని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిసే బాలకృష్ణ విమర్శించారు. గిరిజనులను అభివృద్ధి చేయడానికి బదులుగా సమాధి చేయడానికి పాడె కడుతున్నట్లు ఉందని ఆరోపించారు.ఏజెన్సీలో గిరిజనుల అభివృద్ధికి కేంద్రబిందువైన ఐటీడీఏలో పరిపాలన గాలిలో దీపంలా ఉందని అన్నారు. పరిపాలించే అధికారులు లేక చెదలు పట్టిన చెట్టులా తయారైందని తీవ్రంగా మండిపడ్డారు.ప్రభుత్వాలు ఎన్ని మారినా ఆదివాసీల స్థితి మాత్రం మారడం లేదన్నారు. పైపెచ్చు ఐటీడీఏలను నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఐటీడీఏలో అడ్మినిస్ట్రేషన్ సరిగా లేకపోవడంతో గిరిజనులు ఆఫీసుకు వచ్చి పనులు కాక తీవ్ర అసంతృప్తితో వెనుదిరుగుతున్నారని వాపోయారు.

**పులిసే బాలకృష్ణ మాట్లాడుతూ.**

ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి. ఐటీడీఏలో ఖాళీగా ఉన్న ఏపీఓ. ఏవో. ఎస్ఓ.పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. గిరిజనుల అభివృద్ధికి సహకరించాలి. లేనిపక్షంలో ఆదివాసీలను ఏకం చేసి దశల వారీ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం. ప్రభుత్వం మెడలు వంచైనా సాధించుకుంటాం.

## బిజెపి కుట్రలను తిప్పి కొడతాం

**మాజీ డిసిసి అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి హెచ్చరిక**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) సర్ ప్రక్రియను కేంద్రం క్లిష్టతరం చేసిందని, బిజెపి కుట్రలు తిప్పికొడతామని డిసిసి మాజీ అధ్యక్షులు, ఏఐసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. సర్ ప్రక్రియపై మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పలువురు సర్ పై తమ సూచనలను సలహాలను అందజేశారు. అనంతరం మాజీ డిసిసి అధ్యక్షులు, ఏఐసిసి అధికార ప్రతినిధి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కు ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఓటర్లే ముఖ్యమని అయితే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఈ ఓట్లను కాంగ్రెస్ కు దూరం చేయడానికి సర్ ప్రక్రియను క్లిష్టతరం చేసిందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించిన సర్ ను సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి సర్కిల్ లో ఇప్పటివరకు 43.6 శాతం పూర్తయిందని ఇంకా దీనిని మరింత పెంచేందుకు కాంగ్రెస్ శ్రేణులు మరిత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 3 వరకు ఉన్న గడువు లోపట 43.6 శాతంను మరింత పెంచాలని పిలుపునిచ్చారు. ప్రతి అర్హులైన ఓటర్లు ఉండేలా కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సూచించారు. ప్రజల ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇందుకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని కోరారు. అర్హులైన ఓటర్ల వద్దకు సర్ ఫామ్ ల ను చేర్చి ఫామ్ లను నింపాక తిరిగి బిఎల్ఓ లకు అందజేయాలని, ఈ బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకొని అర్హులైన ఓటర్ల ఓటు హక్కును కాపాడాలని హరి వర్ధన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్, మేడ్చల్ డివిజన్ అధ్యక్షులు చాపరాజు, కిష్టాపూర్ పూడూరు డివిజన్ అధ్యక్షులు మల్లేష్ గౌడ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, రమణారెడ్డి బాల్ రెడ్డి, రామన్న గారి రాఘవేందర్ గౌడ్, ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి, మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్‌మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ మాజీ కౌన్సిలర్ మహేష్, కౌన్సిలర్లు విగ్నేశ్వర్ రెడ్డి, ముత్యాల గౌడ్ తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## ఇసుక వాగు బ్రిడ్జిపై రాకపోకలకు నిషేధం






వాజేడు(ప్రశ్న న్యూస్) వాజేడు మండలం చీకుపల్లి గ్రామ పరిధిలోని ఇసుక వాగుపై నిర్మిస్తున్న శాశ్వత వంతెన పనుల నేపథ్యంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతింది. వాగులో వరద నీరు చేరడంతో తాత్కాలిక రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న ఏటూరునాగారం ఏ.ఎస్.పి మనన్ భట్, ఆదివారం అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తాత్కాలిక రహదారిపై రాకపోకలు ప్రమాదకరమని గుర్తించి వెంటనే ఇరువైపులా భారీ కేడ్లు ఏర్పాటు చేయించారు.

ఏఎస్పి మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు పునరుద్ధరించే వరకు ఇరువైపులా రాకపోకలను నిషేధించాం. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి. త్వరలోనే రహదారిని బాగు చేసి వాడుకలోకి తెస్తాం. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలందరూ అధికారులకు సహకరించాలి.ప్రస్తుతం ఇసుక వాగు బ్రిడ్జిపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సిఐ.రమేష్.వాజేడు ఎస్ఐ.సతీష్.పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది

**- రేంజ్ ఆఫీసర్ వినాయక్**




వ్యవసాయ క్షేత్రంలో చిక్కుకున్న కృష్ణజింకను రక్షించి అడవిలో విడిచిపెట్టిన అటవీ శాఖ సిబ్బంది గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో చిక్కుకున్న కృష్ణజింకను అటవీ శాఖ సిబ్బంది సకాలంలో రక్షించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ ఆఫీసర్ పవన్ కుమార్ మాట్లాడుతూ, గజ్వేల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్ ఆదేశాల మేరకు స్వల్ప గాయాలపాలైన కృష్ణజింకను గజ్వేల్ వెటర్నరీ ఆసుపత్రికి తరలించి పశువైద్యుడు డాక్టర్ రమేష్‌తో ప్రథమ చికిత్స అందించామని తెలిపారు. అనంతరం కృష్ణజింకను కల్పవనం అర్బన్ పార్క్‌లోని పెద్ద చెరువు పరిసరాల్లో సురక్షితంగా విడిచిపెట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రేంజ్ ఆఫీసర్ వినాయక్ మాట్లాడుతూ, వన్యప్రాణులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అంతరించిపోతున్న లేదా గాయపడిన వన్యప్రాణులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వన్యప్రాణులకు హాని కలిగించడం చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై అటవీ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ తో సాయి పేట శ్రీనివాస్ భేటీ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్ తో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ భేటీ అయ్యారు. గుండ్లపోచంపల్లి 299 డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిస్థితి, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై గుండ్లపోచంపల్లి 299 డివిజన్ నేతలతో చర్చించారు. అదేవిధంగా, సర్ కార్యక్రమం డివిజన్‌లో ఎలా కొనసాగుతోందనే విషయంపై సాయిపేట శ్రీనివాస్‌ను వేముల మహేష్ గౌడ్ అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా నిర్వహించే అంశాలపై కూడా చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్,మాజీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ , మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్,ఎస్సి సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్, లేబర్ సెల్ అధ్యక్షులు కావలి భాస్కర్, లక్ష్మి నారాయణ స్వామి దేవస్థానం డైరెక్టర్లు ఉదయ్ గౌడ్, బండారి అనిల్, షబ్బీర్, సోను, మాధవ్ రెడ్డి, సంపత్ గౌడ్, కండ్లకోయ వెంకట్, సత్తన్న, ప్రసాద్, సురేందర్ రెడ్డి,

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**- యూఎస్ఎఫ్ఐ డిమాండ్**




గజ్వేల్ (ప్రశ్న న్యూస్)బీజేపీ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులు, యువకులపై జరిగిన లాఠీచార్జీని ఖండిస్తూ యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్, జిల్లా కార్యదర్శి గుడికందుల రవి మాట్లాడుతూ, విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుండగా వారిపై లాఠీచార్జీ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు హేమంత్, రాకేష్, రంజిత్, అభినయ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలినినో ప్రభావం వల్ల ఏర్పడే సమస్యలను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

**తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**




మేడ్చల్( ప్రశ్న న్యూస్ )ఎలినినో ప్రభావం వల్ల ఏర్పడే సమస్యలను అధిగమించేందుకు శాఖల వారీగా కార్యాచరణ ఏర్పాటు చేసుకొని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలంగాణ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన ఎల్ నీనో పై ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే వర్కపల్లి శంకరయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,రంగారెడ్డి జిల్లా స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఫ్లాగ్ షిప్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సవ్యసాచి గోష్, వాటర్ బోర్డు ఎండి అశోక్ రెడ్డి, మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి లతో కలిసి స్పీకర్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్‌నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ, వివిధ శాఖల సంసిద్ధత, కంటింజెన్సీ ప్రణాళికపై సమీక్షించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఎలినినో ప్రభావం వల్ల ఏర్పడే సమస్యలను అధిగమించేందుకు శాఖల వారీగా కార్యాచరణ ఏర్పాటు చేసుకొని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని మండల స్థాయి జిల్లా స్థాయి లలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. వ్యవసాయ శాఖ వర్షాభావం వలన అధిక నీరు అవసరమయ్యే వరి పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలైన తక్కువ నీటితో పండించే ఉలవ, పెసర, కంది, వేరుశనగ, మినుములు వంటి పంటలను పండించాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రజ్ఞుల సూచనల మేరకు తక్కువ నీటితో అధిక రాబడి అందించే పంటలను పండించాలని అన్నారు. అంతే కాకుండా కరువు పరిస్థితుల దృష్ట్యా ఆపత్కర పంటలను రైతులకు తెలియజేస్తూ వాటి పెంపకంలో వారికి అవగాహన కల్పించాలని వారికి అవసరమైన సలహాలు సూచనలు, సామాగ్రిని అందించాలని తెలిపారు. ఉద్యానవన శాఖ వారి సూచనల మేరకు కూరగాయలు, పూల తోటలు వంటివి అధికంగా పండించాలన్నారు. పంటల సాగులో డ్రిప్ ద్వారా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడిని సాధించాలన్నారు. నీటి సంరక్షణ ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పర్యావరణ పరిరక్షణ గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరచుకోవడం లక్ష్యంగా జలసిరి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలి అన్నారు. జలసిరి కార్యక్రమం ద్వారా వర్షపు నీటిని సద్వినియోగం చేయడం భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించడం వర్షపు నీటిని నిలువ చేసేలా గుంటలను ఏర్పాటు చేయడం వృధాగా పోయే నీటిని సంరక్షించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాల నీటి స్థాయిని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అందులో భాగంగా ప్రతి ఒక్కరూ నీటి గుంటలను ఏర్పాటు చేయాలని సూచించారు వ్యవసాయ ప్రాంతాలలో చిన్న చిన్న నీటి గుంటలను ఏర్పాటు చేసి నీటిని సంరక్షించుకొని భూగర్భ జలాలను పెంచుకోవాలని తెలిపారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు. మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని అందించే ప్రక్రియలో పైపు లీకేజీలు వంటి సమస్యలను వెంటవెంటనే పరిష్కరించి నీటి వృధాను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి , వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల అదనపు కలెక్టర్లు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మన్యం జిల్లాకు రెండు కుంకీ ఏనుగులు

**అడవి ఏనుగుల బెడద నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు**

**గుచ్చిమి క్యాంపుకు తరలింపునకు అటవీ శాఖ సన్నాహాలు**



పార్వతీపురం మన్యం(ప్రశ్న న్యూస్) ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో అడవి ఏనుగుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ--పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పలమనేరు శిబిరం నుంచి రెండు శిక్షణ పొందిన కుంకీ ఏనుగులను మన్యం జిల్లాలోని గుచ్చిమి క్యాంపుకు తరలించేందుకు అటవీ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ముసలమడుగు క్యాంపులో ఉన్న 'జయంత్' మరియు 'అభిమన్యు' అనే రెండు కుంకీ ఏనుగులను ప్రత్యేక బృందాల పర్యవేక్షణలో గుచ్చిమి క్యాంపుకు తరలించనున్నారు. ఈ రెండు కుంకీలు మానవ-ఏనుగు సంఘర్షణలను నియంత్రించడంలో విశేష అనుభవం కలిగి ఉన్నాయి. ఇటీవల పలమనేరు సమీపంలో ఒంటరి అడవి ఏనుగును విజయవంతంగా బంధించిన ఆపరేషన్‌తో పాటు మొత్తం ఆరు కీలక ఆపరేషన్లలో ఇవి సమర్థవంతంగా పనిచేశాయి. వాటి సమన్వయం, పనితీరును పరిగణనలోకి తీసుకుని మన్యం జిల్లాకు ఎంపిక చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దు గ్రామాల్లో ఒడిశా నుంచి తరచూ అడవి ఏనుగుల గుంపులు ప్రవేశించి పంటలను ధ్వంసం చేయడం, గ్రామాల్లోకి చొరబడి ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. అడవుల విభజన, ఆహారం, నీటి కొరత వంటి కారణాలతో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వంతో సమన్వయం చేసి అడవి ఏనుగులను తిరిగి అడవుల్లోకి మళ్లించే చర్యలతో పాటు, భవిష్యత్తులో అక్కడి నుంచి మరిన్ని కుంకీ ఏనుగులను తీసుకురావడంపై కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తక్షణ ఉపశమన చర్యగా రాష్ట్రంలో అందుబాటులో ఉన్న రెండు కుంకీలను గుచ్చిమి క్యాంపుకు తరలించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించినట్లు వెల్లడించారు. కుంకీ ఏనుగులతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో సౌర కంచెల ఏర్పాటు, రక్షణ కందకాల తవ్వకం, అడవుల్లో నీటి వనరుల అభివృద్ధి, ఏఐ ఆధారిత పర్యవేక్షణ, డ్రోన్ నిఘా, హనుమాన్ ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల మోహరింపు, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు వంటి సమగ్ర చర్యలను కూడా ప్రభుత్వం అమలు చేయనుంది. ఈ చర్యలతో ఒడిశా సరిహద్దు గ్రామాల్లో అడవి ఏనుగుల బెడదను సమర్థవంతంగా నియంత్రించి, ప్రజల ప్రాణ, ఆస్తి, పంటలకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

# వ్యాధుల కాలం - జర పైలం

**- అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న వైద్యులు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వర్షాకాలం సమీపిస్తుండడంతో బ్యాక్టీరియా, వైరస్ విజృంభించి మనుషులపై పలు రకాల వ్యాధులు వ్యాపిస్తుంటాయి. ఇలాంటి సమయంలోనే ప్రతి వ్యక్తి అప్రమత్తంగా ఉండాలి లేకుంటే రోగాల బారిన పడక తప్పదు. ముఖ్యంగా పారిశుధ్య సమస్య కారణంగా మలేరియా, డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్ సీజనల్ వ్యాధుల వ్యాప్తికి కారణాం కానున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల వలన వాతావరణంలో భిన్నమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని, తద్వారా ముందస్తు చర్యలను చేపట్టి అవగాహన కార్యక్రమాలతో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని సమాచారం. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్షాల నాయకులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ పరీక్షలు చేసేందుకు అవసరమైన కిట్స్ పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఉన్న కిట్లను అత్యవసరమైతేనే వినియోగిస్తున్నారు. అయితే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం పారిశుధ్య సమస్యతో పాటు కలుషిత నీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




### పారిశుధ్య సమస్యే

ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు పారిశుధ్య సమస్యే కారణమవుతోంది. రోజుల తరబడి ఎక్కడి చెత్త అక్కడే ఉండి పోవడం, డ్రైనేజీలు పూడికతో నిండిపోవడం, మురు గు నీటి గుంతలు నిండిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల నివారణకు ఫాగింగ్, మురుగు నీటి గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనుల జాడే లేదు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థలు అధ్వానంగా మారడం, పూడిక తీయకపోవడం, ఇళ్ల సమీపంలోనే మురుగు నీరు నిల్వ ఉండడం, నగరంలో ఉన్న చెరువులలో గుర్రపు డెక్క తొలగించకపోవడం, గుంతల్లో నీరు నిలిచి ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రాణాంతక వ్యాధులకు కారణామవుతున్నాయి.

### నివారణ చర్యలే ముఖ్యం

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య సమస్యను నివారిస్తే వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చాలా చోట్ల నీరు నిలిచి ఉండడంతో దోమలు విజృంభించడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పల్లెలు, పట్టణాల్లో పరిసర ప్రాంతాలు పరిశు భ్రతను పాటిస్తే వ్యాధుల సమస్యను అరికట్టే అవకాశం ఉంటుంది. పారిశుధ్య అధికారులు సిబ్బంది పూర్తిస్థాయిలో విధులు నిర్వహించడం లేదని, అలాగే ఫాగింగ్ జరగడం లేదనే విమర్శలు ప్రజల నుండి వ్యక్తమవుతున్నాయి.

### దోమల నివారణ

దోమ కాటుకు గురి కాకుండా ఇంటిలో దోమ తెరలు, కిటికిలకు జాలీలు, దోమలను చంపే స్ప్రేలు, వివిధ రసాయనాలతో పొగ పెట్టడం లాంటివి చేయాల్సి ఉంటుంది. ఇళ్ల పరిసరాల్లో నీళ్ల కుండీలు, బావులు, నీటి గుంతలు ఉండకుండా జాగ్రత్తలు చే పట్టాలి. నీటి ఆవాసాలు, కుండీల్లో దోమలు ఆవా సాలు ఏర్పాటు చేసుకుని గుడ్లు పెట్టుతాయి. అలాంటి ఆవాసాలు ఇంటి పరిసరాల్లో లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వారంలో ఒక రోజు డ్రై డేను పాటించాలి. ఇంటిపై ట్యాంకులు, పైపులు, ఇనుప డబ్బాలల్లో దోమలు గ్రుడ్లు పెట్టకుండా మూతలు పెట్టాలి. ఇదే కాకుండా గ్రేటర్ హైదరాబాద్ పరిధితో పాటు నగరం చుట్టుపక్కల ఉన్న చెరువులను గుర్రపు డెక్కన్ వెంటనే తొలగించి దోమలు రాకుండా కెమికల్ స్ప్రే చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది దానితోపాటు నాలాలను పూర్తిగా శు భ్రపరచి దోమల నివారణ అయ్యేటట్టు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## లోక కల్యాణార్థం కన్నుల పండుగగా
# బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం

**-శాస్త్రోక్తంగా వేదమంత్రాల మధ్య ఘనంగా కళ్యాణక్రతువు**

**- భారీగా భక్తజన సందోహం**

**- అమ్మవారి దర్శనానికి గంటల తరబడి వేచి ఉన్న భక్తులు.**



బల్కంపేట (ప్రశ్న న్యూస్) లోక కల్యాణం కోసం మహిమాన్విత శక్తి స్వరూపిణి అయిన బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం మంగళవారం నాడు అంగరంగవైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన బోనాల పండగకు ముందు బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం జరిపించడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. ఈ అమ్మవారి కళ్యాణాన్ని కనులారా వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో అమీర్ పేట్, ఎస్ ఆర్ నగర్, బల్కంపేట, సనత్‌నగర్, ఫతేనగర్ తదితర ప్రాంతాలు జనసంద్రంగా మారిపోయాయి. కళ్యాణం సందర్భంగా వేకువజాము నుండే ఆలయంలో వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా ఎదుర్కోలు వేడుకలు నిర్వహించిన అనంతరం కళ్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. బుధవారం నాడు ఆలయ పరిసర ప్రాంతాలు, ప్రధాన వీధులలో సంప్రదాయబద్ధంగా నిర్వహించే అమ్మవారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రథోత్సవ కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారని సమాచారం.

# మార్కెట్ సెక్రటరీ నోటిసులు,అసోసియేషన్ తీర్మానాలు

**- బోయిన్ పల్లి మార్కెట్ లో వర్తకులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి లేకపోతే కఠిన చర్యలు తప్పవు**

**-“175”మంది కమీషన్ ఏజెంట్లకు నోటిసులు జారీ చేసిన సెక్రటరీ ఈ.వేంకటేశం**

**-సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ ఎన్నికలు జరిగి రెండున్నర ఏళ్లు జరిగిన -ఎజెండాలో ఏ ఒక్క పని కూడా అమలు చేయలేదని ప్యానల్ సభ్యులే నీలదీత.?**

**-మిగిలిన ఆరు నెలలన్న ఐక్యతతో మన సత్తా చాటుదాం.లేకపోతే స్వచ్ఛందంగా రాజీనామా.?**

**-అధ్యక్ష పది మందిలో పరువూ పోతుంది,రేపు**

**-నలుగురు నిలదీస్తే పరిస్థితి ఏంటి.బాడీలో ఉన్నందుకు**

**- సుడిగుండాల్లా సమస్యలు చుట్టుముట్టాయి.మాకు దిక్కెవరు.?**

**-ఇక ముందు మార్కెట్ లో కిలో నుంచి ఐదు కిలోల కవర్లతో వ్యాపారానికి చెక్.**

**-అయిన కొనసాగుతే జరిమానా తప్పదు.?**

**-యార్డ్ లో నలుదిక్కులా చెత్త వేయకుండా ఒకే చోట**

**-వేస్తే అందరికి మంచిది,లేక పోతే సమస్యలకు చేరువైతాం.**




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారుతున్నారని మార్కెట్ సెక్రటరీ ఈ.వేంకటేశం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ విధి విధానాలు ఏమైనా మీకు తెలుస అని బోయిన్ పల్లి మార్కెట్ కమీషన్ ఏజెంట్లను ప్రశ్నించారు.ఒకపక్క యార్డ్ లో మౌలిక సమస్యల విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులు సరిపోక,కొత్తగా మీ పనికి మాలిన కార్యకలాపాలు సమాజంలో తల దించుకునేలా ఉన్నాయని ఆయన హెచ్చరించారు. మార్కెటింగ్ డిపార్ట్మెంట్ జారీ చేసిన “175”మంది లైసెన్స్ దారులకు మార్కెట్ సెక్రటరీ మత్తు పదార్థాలు, మద్యం,ప్యాకాట ఏమైనా తన దృష్టికి వస్తే లైసెన్స్ రద్దు చేసేస్తాం అంటూ “నోటిసులు”జారీ చేశారు.

### బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ ఈ. వేంకటేశం వివరణ..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో ఎవ్వరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్ యార్డులో వర్తకులు వ్యాపార లావాదేవీలు నిర్వహించాలే తప్పా, వ్యక్తి గత విషయాలు మార్కెట్ లో సినిమా చూపిస్తే, అధికారులుగా మేము వారి బయోగ్రఫీ తీయాల్సి వస్తుంది. లైసెన్స్ ఇచ్చింది వ్యాపారం కోసం అంతేగానీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఉత్పన్నమయ్యే సమస్యలు ఊహించలేరని సెక్రటరీ కమీషన్ ఏజెంట్లకు హెచ్చరించారు.అలాగే వర్తకుల మధ్య సవాలక్ష సమస్యలు ఉండోచ్చు కానీ మార్కెట్ యార్డు బయట చూసుకోవాలి అంతే గానీ మార్కెట్ లో నిషేధిత పదార్థాలతో ఊగిపోతాం అంటే,ఈ సారి నోటిసులు ఉండవు, లైసెన్స్ లే రద్దు.?

### అధ్యక్ష బాడిలో ఉంటే “వై ఫై”లా సమస్యలు చూట్టు ముట్టాయి..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు పై బోయిన్ పల్లి మార్కెట్ లో అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ ఎన్నికలు గత రెండున్నర సంవత్సరాల క్రితం జరిగిన విషయం అందరికి తెలిసిందే.ఈ రెండున్నర ఏళ్లగా ఏ ఒక్క మంచి పని చేసింది లేదని అసోసియేషన్ లో ఉన్న ఇరవై ఏడు పదువుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ తమఅభిప్రాయాలు వ్యక్తం చేశారు.అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మీరు మాట్లాడింది వాస్తవమే ఇక ముందు మనందరం ఈ ఆరు నెలలు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మరి ముఖ్యంగా మార్కెట్ లో “కిలో నుంచి ఐదు కిలోల బరువు ఉన్న కవర్లతో వ్యాపారానికి చెక్.ఒకవేళ ఇలానే కొనసాగితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.మరో విషయం ఏమిటంటే అమావాస్య తో పాటు”సదరు కమీషన్ ఏజెంట్ “చనిపోతే సెలవు తప్పని సరిగా అమలు చేయాలని డిమాండ్. అలాగేమార్కెట్ యార్డులో వర్తకులు వ్యాపార లావాదేవీలు నిర్వహించాలే తప్ప మరేమీ ఇతరత్రా కార్యక్రమాలు చేపడకూడదు.మార్కెట్ , లో సెక్యూరిటీ సంఖ్య మరింతగా పెంచాలని, అలాగే ఈ మధ్య జరిగిన విజిలెన్స్ అధికారులు మార్కెట్ లో తనీఖిలు చేసిన విషయం విదితమే.రేపు మన దగ్గరకు కూడా రావచ్చు,అందరు ఒకే మాట పై ఉండాలని చర్చ.?కొందరు తమ ఆవేదనను అధ్యక్షుడుతో ఈ విధంగా పంచుకున్నారు గతంలో ఎటువంటి పదవులు లేకుండా వ్యాపారం”మూడు పువ్వులు ఆరు కాయలుగా “బిజినెస్ చేసుకునేవాళ్లం.ప్రస్తుతం అసోసియేషన్ లో అర్హతే అన్నింటికీ శత్రువుగా మారి మా తలరాతలు తలకిందులుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇకఈ పదువులు వద్దు”మహా ప్రభూ”అంటూ దండాలు పెడుతున్నారు.ఇప్పటిదాకచూట్టు ముట్టిన సమస్యలు చాలు,”కామ్ అవుర్ ఘర్”తో ముందుకు పోవాలని వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.మరి కొందరు అయితే అధ్యక్ష ఇది నీకు తగున “స్థాయి మరిచి సంబరాల్లో”సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలుస్తున్నారని తెలిపారు.మరో గొప్ప విషయం ఏమిటంటే అసోసియేషన్ ఏర్పడి రెండున్నర ఏళ్లల్లో మొట్టమొదటి సారి పూర్తి స్థాయిలో బాడీ హాజరు.ఇదే స్టైల్ లో ముందుకు పోతే విజయాలు మీ సొంతం అంటున్నారు మార్కెట్ వర్గాలు.



## ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు
# నమ్మిన రైతులు నష్టపోయారు

**- మీకు ఉరిశిక్ష వేసినా తప్పులేదన్న హరీష్ రావు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను నమ్మి దేవాదుల ప్రాజెక్టు కింద నారుమడులు పోసుకున్న రైతులు ఇప్పుడు నీళ్ల లేక తీవ్రంగా నష్టపోయారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి మాటలు నమ్మి నాట్లు వేసుకుంటే, ఇప్పుడు నీళ్లు రాక ఆ నారుమడులన్నీ ముదిరిపోయి పుచ్చిపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. దేవాదుల నుంచి 38.16 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, 22 రిజర్వాయర్లను నింపి ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం డైలాగులు కొట్టిందని విమర్శించారు. అసలు ఆ నీళ్ల మంత్రికి దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా తెలియదని హరీశ్ ఎద్దేవా చేశారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వానికి నీళ్ల నిర్వహణపై కనీస అవగాహన లేదని విమర్శించారు. దేవాదుల అనేది బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టు అని, ఆ విషయం కూడా కాంగ్రెస్ నాయకులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం విషయంలో కుంటిసాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసిన ప్రభుత్వం మరి దేవాదుల వద్ద నీళ్లు ఎత్తడానికి ఏం అడ్డంకి వచ్చిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. తాను ప్రెస్ మీట్ పెట్టి నిలదీసిన తరవాతే మంత్రులు హెలికాప్టర్ వేసుకుని అక్కడికి పరిగెత్తారని తెలిపారు. రేపే మోటార్లు నడుపుతామని మంత్రులు ఒకరిని మించి ఒకరు ఉపన్యాసాలు దంచారని, కానీ ఎనిమిది రోజులు గడిచినా ఇప్పటికీ 10 మోటార్లు కూడా స్టార్ట్ కాలేదని ఎద్దేవా చేశారు. మంత్రులు వెళ్లిన రోజు ఏడు మోటార్లు నడిస్తే, తెల్లారేసరికి అవి ఐదుకి పడిపోయాయని, కాంగ్రెస్ మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప చేతల్లో శూన్యమని అన్నారు.

# కోకా-కోలాకు కొత్త లుక్

**- ప్రపంచవ్యాప్తంగా మారనున్న బ్రాండ్ ఐడెంటిటీ**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) శీతల పానీయాల దిగ్గజం కోకా-కోలా తన బ్రాండ్‌కు సరికొత్త రూపును అందిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లలో తన ఉనికిని చాటుకునేలా నూతన ‘గ్లోబల్ బ్రాండ్ ఐడెంటిటీ’ని మంగళవారం అధికారికంగా ఆవిష్కరించింది. మారుతున్న వినియోగదారుల అభిరుచులు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్పు ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కోకా-కోలా ప్యాకేజింగ్, మార్కెటింగ్ ప్రచారాలు, డిజిటల్ వేదికలపై స్పష్టంగా కనిపించనుంది. బ్రాండ్ వారసత్వ విలువలను కాపాడుకుంటూనే, వినియోగదారులతో మరింత బలమైన భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరచుకోవడమే తమ లక్ష్యమని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నూతన గుర్తింపులో భాగంగా లోగోలో స్వల్ప మార్పులు, ఆకర్షణీయమైన రంగులు, ఆధునిక టైపోగ్రఫీ వంటి అంశాలను జోడించారు. శీతల పానీయాల రంగంలో పెరుగుతున్న పోటీని తట్టుకుని, మార్కెట్లో తమ అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకునే వ్యూహంలో భాగంగానే ఈ మార్పులు చేపట్టినట్లు కోకా-కోలా వివరించింది. ఈ సరికొత్త బ్రాండ్ ఐడెంటిటీని త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఆయా ప్రాంతాలలో ఈ మార్పులు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయనే వివరాలను కంపెనీ త్వరలోనే వెల్లడించే అవకాశం ఉంది.

# జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు హైకోర్టు బ్రేక్

**- వార్డుల డీలిమిటేషన్ పూర్తయ్యే వరకు నోటిఫికేషన్ బ్రేక్**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత వీడటం లేదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల నిర్వహణపై తాజాగా తెలంగాణ హైకోర్టు బ్రేక్ వేసింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో వార్డుల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం వార్డుల సరిహద్దులను చట్టబద్ధంగా తిరిగి నిర్ధారించే వరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామంతో జీహెచ్‌ఎంసీ ఎన్నికల షెడ్యూల్‌పై అనిశ్చితి నెలకొంది.

**- డీలిమిటేషన్‌పై పిటిషన్**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజన నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ఆరోపిస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. 1996 జీవో నంబర్ 570లోని రూల్-5 ప్రకారం జనాభా ప్రాతిపదికనే వార్డుల డీలిమిటేషన్ జరగాలని అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిబంధనలను పాటించలేదని పిటిషనర్లు వాదించారు. అలాగే తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్-2019లోని సెక్షన్-6 ప్రకారం ప్రజల అభ్యంతరాలు స్వీకరించి పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా ఆ నిబంధనలను కూడా ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం, పిటిషనర్ల తరఫు లాయర్లు వాదనలు విన్న హైకోర్టు ప్రాథమికంగా పిటిషన్‌లో ఉన్న అంశాలను పరిశీలించింది. తదుపరి విచారణ పూర్తి అయ్యే వరకు వార్డుల సరిహద్దులను చట్టబద్ధంగా పునర్నిర్ణయించాలని అప్పటివరకు జీహెచ్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయరాదని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.హైకోర్టు నిర్ణయంతో జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు సిద్ధం అవుతున్న రాజకీయ పార్టీల వ్యూహాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం డీలిమిటేషన్ ప్రక్రియను ఎలా సమర్థించుకుంటుంది తదుపరి విచారణలో ఎలాంటి ఆధారాలు సమర్పిస్తుంది అనే అంశాలపై ఎన్నికల భవిష్యత్తు ఆధారపడనుంది. హైకోర్టు తుది తీర్పు వచ్చే వరకు జీహెచ్‌ఎంసీ ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగే అవకాశం లేదని న్యాయ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జీహెచ్‌ఎంసీ ఎన్నికల కోసం రాష్ట్రంలోని అన్ని పార్టీలు ఇప్పటికే సమాయత్తం అవుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పీఠాన్ని దక్కించుకోవాలని అధికార కాంగ్రెస్ పార్టీ ఉవ్విళ్లూరుతుండగా ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు కూడా సై అంటున్నాయి. ఇక జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని ఇప్పటికే జనసేన పార్టీ ప్రకటించగా ఒంటరిగానే బరిలోకి దిగుతుందా లేక ఆంధ్రప్రదేశ్‌లో లాగా టీడీపీ, బీజేపీలతో కలిసి ఎన్డీఏ కూటమిగా పోటీ చేస్తుందా అనేది ఇంకా క్లారిటీ రాలేదు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588